
దర్శించండి - తరించండి
స్వయంభు శ్రీ వరసిద్ధి వినాయకస్వామి వారి దేవస్థానం
కాణిపాకం, ఐరాల (మం), చిత్తూరు జిల్లా.
సత్య ప్రమాణాలకు, ప్రత్యక్ష నిదర్శనం...
శ్రీ వరసిద్ధి వినాయక స్వామి దేవస్థానం శ్రీ స్వామి వారి
శాశ్వత అన్నదాన ట్రస్టులో భాగస్వామ్యం కండి. మీ విరాళాలను ఆన్‌లైన్‌లో కూడా పంపవచ్చు.
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, కాణిపాకం బ్రాంచ్
A/c No. 30178925930, IFSC No. SBIN0010105
మరిన్ని వివరాలకు : 08573-281112, 281747



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176
epaper : https://varthaprabha.com
సమగ్ర వార్తా దినపత్రిక
విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 14 | ది. 11-4-2026 | శనివారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 14 | Date : 11-4-2026 | Saturday | Pages : 8 | Rs.1/- |


## భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# ప్రపంచ సాంకేతిక పటంలో ఏపీకి నవశకం

- క్వాంటం డీప్ టెక్ లో అజేయ శక్తిగా అమరావతి
- ఏప్రిల్ 14 తేదీన ప్రారంభం క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీ
- మేధాటవర్స్, ఎస్ఆర్ఎం నుంచి పనిచేయనున్న 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్ బెడ్స్
- డ్రగ్ డిస్కవరీ, వెదర్ మోడలింగ్ సహా వివిధ పరిశోధనలు, ఆవిష్కరణల కేంద్రంగా అమరావతి క్వాంటం వ్యాలీ
- దేశంలోనే తొలిసారి స్వదేశీ తయారీ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** నవశకం సాంకేతికత క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ గా అమరావతి ఎదుగుతోంది. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అవసరమైన ఎకోసిస్టం సిద్ధమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవానికి నాంది పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ తో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ ప్రపంచానికి చిరునామాగా మారుస్తున్నారు. ఏప్రిల్ 14, ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ క్వాంటం కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీని సీఎం ప్రారంభించనున్నారు. గన్నవరంలోని మేధాటవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్సు ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఈ స్వదేశీ నిర్మిత క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీలు అమరావతిని ఓ అత్యాధునిక క్వాంటం ఎకోసిస్టమ్ గా తీర్చిదిద్దనున్నాయి. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో భారత్ లోనే తొలిసారి క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించే సౌకర్యాన్ని అమరావతిలో ఏర్పాటు చేశారు. అమరావతి 1ఎస్ పేరిట మినీ క్వాంటం కంప్యూటింగ్ టెస్టింగ్ ఫెసిలిటీని గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేశారు. అమరావతి 1క్యూ పేరిట రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధకుల కోసం ఇది 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన మరో క్వాంటం రిఫరెన్సు టెస్ట్ ఫెసిలిటీని తీర్చిదిద్దారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించేలా ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీగా దీనిని ఏర్పాటు చేశారు.

**క్వాంటం హార్డ్‌వేర్ తయారీలో కీలకం..** మేధాటవర్స్ సహా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్ లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో క్వాంటం కంప్యూటర్లు పనిచేయనున్నాయి. క్వాంటం కంప్యూటర్లలో ఉపకరించే వివిధ పరికరాలను టెస్ట్ చేసేలా ఈ రిఫరెన్సు ఫెసిలిటీలు తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం టెక్నాలజీలో కేవలం సాఫ్ట్‌వేర్ అల్గారిథమ్స్ తో పాటు హార్డ్‌వేర్ తయారీలోనూ స్వయం సమృద్ధి సాధించాలన్నది ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయం. ఇందులో భాగంగా క్వాంటం కంప్యూటర్లకు అవసరమైన పరికరాలను తయారు చేయాలని కూడా లక్ష్యంగా నిర్దేశించారు. ఇటీవలే 30కి పైగా క్వాంటం హార్డ్ వేర్ తయారీ సంస్థలతో ముఖ్యమంత్రి సమావేశం కూడా నిర్వహించారు. అమరావతిలో ఏర్పాటు అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీ భారత్ లో క్వాంటం హార్డ్‌వేర్ నెట్‌వర్క్‌కు యాంకర్ నోడ్ గా తీర్చిదిద్దాలని లక్ష్యంగా నిర్దేశించారు. క్వాంటం తయారీ రంగంలో క్రయోజెనిక్స్ లాంటి సాంకేతికతలను ఉపయోగించి ప్రెసిషన్ ఎలక్ట్రానిక్స్, క్వాంటం గ్రేడ్ ఫ్యాబ్రికేషన్ లాంటి రంగాల్లో స్వదేశీ క్వాంటం కంప్యూటింగ్ ఉపకరణాల తయారీకి కేంద్రంగా అమరావతి మారాలన్నది ఈ ఆలోచన ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పరీక్షించిన క్వాంటం కంప్యూటింగ్ పరికరాలకు సర్టిఫికేషన్ ఇచ్చేలా ఈ టెస్ట్ ఫెసిలిటీలను సిద్ధం చేశారు.

**ఆధునిక గ్లోబల్ టెక్ హబ్ గా ఏపీ..** అమరావతిని ప్రపంచంలోని మొదటి 5 క్వాంటం హబ్‌లలో ఒకటిగా తీర్చిదిద్దేలా రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా క్వాంటం వ్యాలీని ఏర్పాటు చేస్తోంది. దీని కోసం రాష్ట్ర ప్రభుత్వం క్వాంటం కంప్యూటింగ్ పాలసీ 2025-30ని కూడా విడుదల చేసింది. గత ఏడాది జూన్ లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు క్వాంటం డిక్లరేషన్ ను కూడా ప్రకటించారు. అమరావతిలోని ఉద్దండరాయుని పాలెం వద్ద 50 ఎకరాల్లో ఏక్యూవీసీ కేంద్రం నిర్మితం అవుతోంది. ఆరు టవర్లుగా నిర్మిస్తున్న ఈ భవనాల్లో అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఐబీఎం భాగస్వామ్యంతో అత్యంత శక్తివంతమైన 133 క్యూబిట్, 5 కే గేట్ క్వాంటం కంప్యూటర్ ఏర్పాటు కానుంది. ఐబీఎంతో పాటు టీసీఎస్, ఎల్ అండ్ టీ లాంటి ప్రతిష్టాత్మక సంస్థలు అమరావతి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రం ఏర్పాటులో కీలక పాత్ర పోషిస్తున్నాయి. టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్, కేంద్ర ప్రభుత్వంలోని సీఐఎస్ఆర్ నేతృత్వంలోని నేషనల్ టెస్టింగ్ ల్యాబ్ లాంటి సంస్థలు కూడా దీనికి సహకారాన్ని అందిస్తున్నాయి.

## అమరావతిలో విద్యుత్ పనులు వేగవంతం చేయాలి

-మంత్రులు గొట్టిపాటి, నారాయణ ఆదేశం



**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** అమరావతి రాజధాని ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులకు ఆదేశించారు. సచివాలయంలో సీఆర్డీఏ, విద్యుత్ శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిలతో పాటు ఇరు శాఖలకు సంబంధించిన ఇతర అధికారులు హాజరయ్యారు. రాజధాని పరిధిలో చేపట్టిన విద్యుత్ శాఖ పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సమగ్రంగా చర్చించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని మంత్రులు గొట్టిపాటి, నారాయణ అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా విద్యుత్ నిర్మాణ పనులు కొనసాగించాలని సూచించారు. ముఖ్యంగా హైటెన్షన్ లైన్ల మార్పిడి పై ఇరు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. అలాగే, న్యాయమూర్తులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సమావేశంలో చర్చించారు. రాజధాని అభివృద్ధిలో విద్యుత్ మౌలిక వసతులు కీలకమని, వాటి నిర్మాణం నాణ్యతతో పాటు సమయపాలనతో పూర్తి కావాలని మంత్రులు తెలిపారు.

## సీఎం చంద్రబాబుతో బీసీ సంఘాల భేటీ

-ప్రత్యేక బీసీ కమిషన్, రక్షణ చట్టం ప్రవేశపెట్టాలని వినతి

**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** బీసీల సంక్షేమానికి తాము ఎప్పుడూ కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. బీసీల అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం నిరంతరం పని చేస్తుందని వెల్లడించారు. సచివాలయంలో శుక్రవారం ఏపీ బీసీ సంక్షేమ సంఘం నేతలు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు, జాతీయ అధ్యక్షుడు జే. శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో నేతలు సీఎంకు విజ్ఞాపన పత్రాలను అందించారు. జనాభా దామాషా ప్రాతిపదికన తమకు రిజర్వేషన్లు కల్పించే అంశాన్ని కేంద్రంతో చర్చించాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు. బీసీలకు రక్షణ చట్టాన్ని కూడా త్వరితగతిన తేవాలని కోరారు. స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లు అమలు, కేంద్రంతో మాట్లాడి ఓబీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయించడంతో పాటు, ఓబీసీ సబ్ ప్లాన్ రూపొందించి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వ అన్ని శాఖల ఉద్యోగాల నియామకాలలో బ్యాక్ లాగ్ పోస్టులను భర్తీ చేయాలని బీసీ సంఘం నేతలు వినతి పత్రంలో పేర్కొన్నారు. ఏపీ బీసీ సంఘం నేతల నుంచి విజ్ఞాపన పత్రాలను తీసుకున్న ముఖ్యమంత్రి.... కేంద్రం పరిధిలో ఉన్న అంశాలను వారితో సంప్రదించి నెరవేర్చేందుకు కృషి చేస్తామని అన్నారు. బీసీలకు పూర్తి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. బీసీల అభ్యున్నతి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ఈ సందర్భంగా నేతలు ముఖ్యమంత్రితో అన్నారు. బీసీలకు ప్రభుత్వం అందిస్తూన్న ఆదరణ, చేనేతలకు ఉచిత విద్యుత్, మత్స్యకారులకు వేట నిషేధ భృతి, 217 జీవో రద్దు, కల్లు గీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్లు, వడ్డెరలకు మైనింగ్‌లో రిజర్వేషన్లు వంటి వాటిని తెచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని బీసీ నేతలు వ్యాఖ్యానించారు.



## పీఎన్జీ కనెక్షన్లు వేగవంతం చేయండి..

-రాష్ట్రంలో గ్యాస్ సరఫరాపై సీఎం చంద్రబాబు సమీక్ష

**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** రాష్ట్రంలో గ్యాస్ సరఫరా, పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్జీ) కనెక్షన్ల పురోగతిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. అంతర్జాతీయంగా యుద్ధాల కారణంగా ఎల్పీజీ గ్యాస్ సరఫరాలో తలెత్తుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు పూర్తి సన్నద్ధతతో పనిచేయాలని అధికారులను, ఆయిల్ కంపెనీల ప్రతినిధులను ఆయన ఆదేశించారు. ప్రత్యామ్నాయంగా పీఎన్జీ వినియోగాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని స్పష్టం చేశారు. వచ్చే 6 నెలల్లో రాష్ట్రవ్యాప్తంగా 10 లక్షల కొత్త పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఈ విషయంలో ఎలాంటి జాప్యం జరగకూడదని, నిర్దేశిత లక్ష్యాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ చేరుకోవాలని తేల్చిచెప్పారు. ఈ సమీక్షలో భాగంగా 'దీపం' పథకం లబ్ధిదారులను పీఎన్జీ వైపు ప్రోత్సహించడంపై సీఎం ప్రత్యేకంగా దృష్టి సారించారు. దీపం లబ్ధిదారులు పీఎన్జీ కనెక్షన్‌కు మారితే, వారికి పథకం కింద అందే రాయితీ సొమ్మును యథావిధిగా వారి ఖాతాల్లో జమ చేయాలని ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయం తీసుకుందని గుర్తుచేశారు. ఈ విషయంపై లబ్ధిదారులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని, సంబంధిత ఉత్తర్వులను తక్షణమే జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. పీఎన్జీ వాడకం సురక్షితమని, చౌక అని ప్రజలకు వివరించాలన్నారు.

## ఉద్యోగులకు పెండింగ్ బిల్లుల చెల్లింపులపై ఏపీ ఎన్జీజీవో హర్షం

- ఉద్యోగులు పెన్షనర్లు తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదములు



**విజయవాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్లో ఉన్న అనేక బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుతల వారీగా చెల్లిస్తున్నప్పటికీ కొండల పేరుకుపోయిన ఉద్యోగుల బకాయిల లో ముఖ్యంగా దశాబ్దాలు సేవలందించి పదవి విరమణ చేసిన ఉద్యోగులకు సంబంధించిన పదవీ విరమణ బెనిఫిట్స్ అంశంలో ఉద్యోగులు పెన్షనర్లు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఏపీ ఎన్ జి జి ఓ తదితర ఉద్యోగ సంఘాల అభ్యర్థన మేరకు 7వేల కోట్ల రూపాయలకు పైగా చెల్లింపులు జరుగుటకు ఆదేశాలు ఇచ్చిన రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి చెల్లింపులు ప్రక్రియలో ముఖ్య పాత్ర పోషించిన ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ కి, రాష్ట్ర చీఫ్ సెక్రటరీ కి సంబంధిత అధికారులు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని జే ఏ సి చైర్మన్ ఎన్ జి జి ఓ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి డివి రమణ ఒక ప్రకటనలో తెలిపారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ముఖ్యంగా గత రెండు సంవత్సరాల నుంచి తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని దాదాపు నాలుగు సంవత్సరాల నుంచి సరెండర్లు రాని పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఏపి జే ఏ సి నాయకులకు ఇచ్చిన హామీ మేరకు పెండింగ్ చెల్లింపులు చేయడానికి గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఆదేశాలు ఇవ్వటం వారం రోజుల్లోనే కార్యరూపం దాల్చటం సంతోషదాయకమని తెలిపారు.

ఉద్యోగులకు సంబంధించిన వేతన సవరణ కమిటీతోపాటు, సర్వీస్ లో ఉన్న ఉద్యోగుల సరెండర్ లెవ్వు బకాయిలు కూడా గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్లో ఉన్నాయన్న విషయాన్ని కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి దృష్టికి, ఫైనాన్స్ మినిస్టర్ దృష్టికి మరియు చీఫ్ సెక్రటరీగా దృష్టికి తీసుకు వెళ్ళామని తెలిపారు.

ఉద్యోగులకు సంబంధించిన మిగిలిన అన్ని డిమాండ్లను కూడా రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్తున్నామని, వాటికి పరిష్కారం చేసే దిశగా ఏపీ ఎన్జీవో సంఘం మరియు ఏపీ జేఏసీ నిరంతర ప్రయత్నం కొనసాగుతూ కొనసాగిస్తుందని ఒక ప్రకటనలో ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి డివి రమణ తెలిపారు.

## భూమి డాక్యుమెంట్లు పోయినాయి

ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట మండలం తాతకుంట్ల శివారు మిట్టగూడెం గ్రామానికి చెందిన పురేటి శ్రీనివాసరావు సన్ ఆఫ్ సోములు అను నాకు సంబంధించిన విస్సన్నపేట మండలం తాతకుంట్ల గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 62/a విస్తీర్ణం 0.26 భూమిని మేడా పుల్లయ్య కుమారుడు మల్లయ్య నుండి కొనుగోలు చేసిన డాక్యుమెంట్ 398/1991 విస్సన్నపేట రిజిస్టార్ కార్యాలయంలో 1991 ఏప్రిల్ 23వ తేదీన రిజిస్టర్ చేయించుకున్న దస్తావేజులు మరియు అదే గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 62/4 లో 0.43 సెంట్లు భూమి కొక్కెరగడ్డ రామయ్య కుమారుడు సహదేవు నుండి వీలునామా పొందిన డాక్యుమెంట్ 22/2001 అక్టోబర్ 31, 2001 సంవత్సరం తేదీన రిజిస్టర్ అయిన దస్తావేజులు కవరు ఏప్రిల్ 1వ తేదీ 20 26 సంవత్సరం నాడు మా ఇంటి నుండి విస్సన్నపేట జిరాక్స్ షాపుకు వెళ్లే ప్రయాణంలో జారిపోయాయి. ఎక్కడ వెతికినా కనపడలేదు. ఎవరికైనా దొరికినచో నాకు చెందిన ఒరిజినల్ డాక్యుమెంట్లు దయవుంచి ఈ క్రింది అడ్రస్ కు సమాచారం ఇవ్వగలరని ప్రార్థించుచున్నాను

**పురేటి శ్రీనివాసరావు, తండ్రి సోములు**
**తాతకుంట్ల శివారు మిట్టగూడెం, విస్సన్నపేట మండలం.**
**పిన్ కోడ్-521215. సెల్ : 994948 4233**

## పాస్ పోర్ట్ పోయినది

కృష్ణాజిల్లా గుడివాడ మండలం మోటూరు గ్రామానికి చెందిన ఇమ్మడి ప్రణీత్ ఒరిజినల్ పాస్ పోర్ట్ పోయినది. గుడివాడ గౌరీ శంకర పురంలోని డాక్టర్ పెరుమాళ్ళ కేశవరావు ఆసుపత్రి సమీపంలో జారి పడిపోయింది. చుట్టుపక్కల వెతుకగా కనిపించలేదు. పాస్పోర్ట్ నెంబర్ P3736990. ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది సెల్ నెంబర్ కు సమాచారం తెలియజేయగలరు.

**సెల్ నెంబర్ : 9182615551**

## బీసీల హక్కుల సాధన కోసం ప్రాణాలను పణంగా పెడుతున్నా

– బీసీవై పార్టీ అధ్యక్షులు రామచంద్ర యాదవ్

- నేడు మంగళగిరిలో ఆమరణ నిరాహార దీక్ష
- ఇది నా ఒక్కడి పోరాటం కాదు... తరతరాలుగా వంచింపబడుతున్న బడుగు బలహీన వర్గాల పోరాటం
- ఐదు డిమాండ్లు పరిష్కరించే వరకు నా ఆమరణ నిరాహార దీక్ష కొనసాగుతుంది
- ఇది మన హక్కుల కోసం జరుగుతున్న పోరాటం... ఎవరూ గ్రహావేశాలకు గురి కావద్దు
- రామచంద్రయాదవ్ పిలుపు



**మంగళగిరి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** బీసీల భవిష్యత్తును, వారి రాజ్యాంగబద్ధమైన హక్కులను కాపాడటమే లక్ష్యంగా భారత చైతన్య యువజన పార్టీ అధినేత బోడె రామచంద్ర యాదవ్ తన ప్రాణాలను పణంగా పెట్టేందుకు సిద్ధమయ్యారు. తరతరాలుగా అణచివేతకు, అన్యాయానికి గురవుతున్న బీసీల ఆత్మగౌరవాన్ని నిలబెట్టేందుకు, వారి హక్కుల సాధన కోసం "బిసి ధర్మదీక్ష" పేరుతో ఆమరణ నిరాహార దీక్షకు పూనుకుంటున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ చారిత్రాత్మక దీక్ష ఏప్రిల్ 11, 2026, శనివారం ఉదయం 10:45 గంటలకు మంగళగిరిలోని పూలే - మండల్ భవన్ వద్ద ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా రామచంద్ర యాదవ్ భావోద్వేగంతో కూడిన పత్రికాప్రకటన విడుదల చేశారు. "ఇది కేవలం నా ఒక్కడి పోరాటం కాదు, ఇది మనందరి ఆత్మగౌరవ పోరాటం. బీసీ బిడ్డల ఉజ్వల భవిష్యత్తు కోసం, వారి హక్కుల సాధన కోసం ఈ ధర్మ యుద్ధాన్ని ప్రారంభించాను. ప్రతి బీసీ బిడ్డ ఈ పోరాటంలో నాతో కలిసి నడవాలి. మన ఐక్యతే మన బలం, మన ఐక్యతే మన విజయం" అని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి, బీసీల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.

**ప్రధాన డిమాండ్లు:** బీసీ రక్షణ చట్టం: బీసీల హక్కులకు, ప్రయోజనాలకు రాజ్యాంగబద్ధమైన రక్షణ కల్పించేందుకు తక్షణమే ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలి. రాజధానిలో భూమి: రాజధాని ప్రాంతంలో బీసీల సామాజిక, ఆర్థిక అభివృద్ధి కోసం కనీసం 1000 ఎకరాలు కేటాయించాలి. కార్పొరేషన్లకు నిధులు: బీసీ కార్పొరేషన్లకు తగినన్ని నిధులు కేటాయించి, వాటిని పూర్తిస్థాయిలో క్రియాశీలం చేయాలి. సమగ్ర కుల గణన: శాస్త్రీయమైన ప్రాతిపదికన సమగ్ర కుల గణన జరిపి, జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాలి. 44% రిజర్వేషన్లు: విద్యా, ఉద్యోగ, చట్టసభల్లో బీసీలకు 44% రిజర్వేషన్లు అమలు చేయాలి. ఈ ధర్మదీక్షకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బీసీ సంఘాలు, మేధావులు, యువత, ప్రజానీకం పెద్ద ఎత్తున తరలివచ్చి మద్దతు తెలపాలని రామచంద్ర యాదవ్ విజ్ఞప్తి చేశారు. బీసీల హక్కుల సాధన కోసం జరుగుతున్న ఈ శాంతియుత పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు.

## ట్రిబుల్ ఆర్ కు సంఘీభావం తెలిపిన కృష్ణా జిల్లా హిందూ చైతన్య వేదిక



**పెడన,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** శాసనసభ ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజుకు కృష్ణాజిల్లా హిందూ చైతన్య వేదిక సభ్యులు సంఘీభావం తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం లోని ఆయన స్వగృహంలో వీరు శుక్రవారం కలిశారు. ఆకివీడు లో రామాలయం కట్టడానికి పోరా డుతున్న రఘురామకృష్ణరాజు ని వీరు కలిసి రామాలయ నిర్మాణము నకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఉపసభాపతిని వేరు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో చైతన్య వేదిక కృష్ణాజిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీ నరసింహ ఆర్థిక ప్రముఖులు తోట హరిబాబు కృష్ణాజిల్లా మహిళా అధ్యక్షురాలు వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

## గుండెనిండా ధైర్యాన్ని నింపుతున్న టిడిపి పెద్దలు



**విస్సన్నపేట,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలో ఆర్థిక ఇబ్బందులతో ఉన్న కుటుంబాలకు ఆర్థికచేయుత అందించి టిడిపి పెద్దలు వారిని పరామర్శించి గుండె నిండా ధైర్యాన్ని నింపుతున్నారు. ఎన్నికలు ఉన్నా లేకున్నా సమయం ఏదైనా సమస్య ఏదైనా మేమున్నా మంటూ భరోసా ఇస్తూ మండలంలో టిడిపి పెద్దలు ముందడుగు వేస్తున్నారు. వైద్య చికిత్సలు నిర్వహించుకునేందుకు మరియు చనిపోయిన వారి కుటుంబాలను పరామర్శిస్తూ ఆర్థిక చేయూత అందిస్తూ ముందుకు వెళుతున్నారు. ఆ కార్యక్రమంలో భాగంగా బి జె ఆర్ నగర నందు మెసుపాం కుటుంబరావు( కృష్ణ), బొడ్డు భాస్కరరావు సింగపాం ఇమ్మానుయేలు కుటుంబాలకు మాగంటి నాని (సత్యనారాయణ చౌదరి ) సహకారంతో మండల టిడిపి అధ్యక్షులు రాయల సుబ్బారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నెక్కలపు శ్రీనివాసరావు( డాబా శ్రీను ) టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు కొంగల శ్రీనివాసరావు చేతుల మీదుగా ఆర్థిక చేయూత అందించారు. ఈ కార్యక్రమంలో లలితా రామకృష్ణ, తిరువూరు ఏఎంసి డైరెక్టర్ పల్లెపాం రాంబాబు, ముత్తం శెట్టి వంశీ కమతం సురేష్, అబ్బినేని మల్లి, సగ్గుర్తి సుధీర్, దగ్గుల నాని, జొన్నలగడ్డ సుధాకర్, బొడ్డు భూషణం అశోక్ మేకల కిరణ్, గుమ్మ తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

## నూతన పి. హెచ్.సి. లకు శంకుస్థాపన



**కంచికచర్ల,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** గ్రామీణ ప్రాంత ప్రజల ఆరోగ్య పరిరక్షనే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని నందిగామ శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండల పరిధిలోని కీసర గ్రామం నందు15 ఆర్థిక సంఘ నిధులు 36 లక్షల రూపాయలు మరియు మొగులూరు గ్రామం నందు 42 లక్షల రూపాయల 15 ఆర్థిక సంఘం నిధులతో నూతనంగా నిర్మించనున్న గ్రామీణ ప్రాథమిక కేంద్రాలకు మరియు రోడ్లకు నందిగామ శాసన సభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య చేతుల మీదుగా శుక్రవారం భూమి పూజతో పాటు శంకుస్థాపన గావించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ మాట్లాడుతూ సమీప గ్రామీణ ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడానికి ఈ ఆరోగ్య కేంద్రం ఎంతగానో దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెట్ కమిటీ సంఘ ఉపాధ్యక్షులు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబు ఎంపీడీవో వెంకటేశ్వరావు డిప్యూటీ ఎంపీడీవో అప్పారావు ప్రభుత్వ వైద్యాధికారిని గీతా మాధురి ఎం యు ఓబాలాజీ పి ఆర్ ఏ ఈ రవికుమార్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు ఏవో కె వెంకటేశ్వరరావు ఏపీవో రమాదేవి ఏపిఎం విజయ కుమారి మొగులూరు గ్రామ పార్టీఅధ్యక్షులు వెలగా నరసయ్య సొసైటీ అధ్యక్షులు వెలగారామకృష్ణతిరుపతిరావు వెలగా చిన్న నరసింహారావు (డి ఏ పి) బంక కోటేశ్వరరావు గద్దె పవన్ కుమార్ బండి కోటేశ్వరరావు రహీం మాలిక్ సమద్ బంక సీతయ్య జంగా సత్యనారాయణ ఆదిపూడి శివగంగారావు సచివాలయ సిబ్బందితదితరులు పాల్గొన్నారు.

## కాకినాడ జిల్లాలో భారీగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల నమోదు

- రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేస్తున్న జిల్లా పోలీసులు

**కాకినాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ వారి ఆదేశాల మేరకు మార్చి 2026 నెలలో మొత్తం 442 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి మెజిస్ట్రేట్ వారి ముందు హాజరపరచగా వారిలో 312 మందికి జరిమానా విధించారు. వారిలో 309 మందికి 10,000 చొప్పున, ముగ్గురికి 5,000 చొప్పున మొత్తం రూ.31,05,000ల జరిమానా విధించగా, మిగిలిన 130 కేసుల్లో జైలు శిక్షలు విధించారు. వాటిలో 32 కేసుల్లో ఒక్కో రోజు చొప్పున, 48 కేసుల్లో రెండు రోజులు, 26 కేసుల్లో మూడు రోజులు, 6 కేసుల్లో నాలుగు రోజులు, 17 కేసుల్లో ఐదు రోజులు, ఒక కేసులో 7 రోజులు జైలు శిక్షలు వేసినారు. మోటార్ సైకిళ్ళు,ఇతర వాహనాలు నడిపే వారంతా అప్రమత్తంగా ఉండాలని,మద్యం త్రాగి వాహనాలు నడిపితే భారీ జరిమానాలు జైలు శిక్షలు విధింపజేయడమే కాకుండా, తరచుగా డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడితే వారి వాహనాలను సీజ్ చేసి, లైసెన్సులు రద్దు చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రమాదాల నివారణలో మనమంతా రోడ్డు భద్రతా నియమాలు పాటించాలని,అప్పుడే భవిష్యత్తులో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గించవచ్చని పిలుపునిచ్చారు.

## మంత్రులకు చంద్రబాబు సీరియస్ వార్నింగ్..

**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మంత్రివర్గ సమావేశం పలు కీలక నిర్ణయాలతో ముగిసింది. సుమారు మూడు గంటల పాటు సుదీర్ఘంగా సాగిన ఈ భేటీలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన అంశాలతో పాటు, కేంద్ర ప్రభుత్వం, ప్రధాని మోదీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు చేశారు. అయితే, అజెండా అంశాలపై చర్చ ముగిసిన తర్వాత మంత్రులతో ప్రత్యేకంగా సమావేశమైన ముఖ్యమంత్రి, ప్రభుత్వ సమాచారం లీక్ అవుతున్న తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## హనుమాన్ జంక్షన్‌లో వినాయక విగ్రహ ప్రతిష్ట, వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దంపతులు



**హనుమాన్ జంక్షన్, ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గం బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌లో శుక్రవారం పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం నియోజకవర్గ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆయన సతీమణి జ్ఞానేశ్వరి తో కలిసి ఈ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హనుమాన్ జంక్షన్‌లో శ్రీ వరసిద్ధి వినాయక గణపతి దేవాలయ కమిటీ, గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ వరసిద్ధి గణపతి స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవంలో ఎమ్మెల్యే దంపతులు పాల్గొన్నారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి ఆశీస్సులు పొందారు. అనంతరం హనుమాన్ జంక్షన్ -- నూజివీడు రోడ్డులోని శ్రీ లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెళ్లిన ఎమ్మెల్యే దంపతులకు అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. ఆలయంలో నిన్నటి నుండి ప్రారంభమైన వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల రెండో రోజైన నేడు ఉదయం 6 గంటల నుంచే సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం చతుస్థానార్చనలు, అగ్నిప్రతిష్ఠ, మూలమంత్ర హోమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మహాలక్ష్మి అమ్మవారికి శ్రీ సూక్త హోమం నిర్వహించగా, మహిళల ఆధ్వర్యంలో సామూహిక సహస్ర కుంకుమార్చన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య జరిగింది. సాయంత్రం దైవిక రాయబారోత్సవం, మంగళాశాసనం వంటి విశేష పూజలు నిర్వహించారు. ఈ బ్రహ్మోత్సవాలు ఈ నెల 13వ తేదీ వరకు కొనసాగనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈ కార్యక్రమంలో అట్లూరి శ్రీనివాసరావు, చలమలశెట్టి రమేష్, మూల్పూరి సాయి కళ్యాణి, ఆళ్ల గోపాలకృష్ణ, వేములపల్లి శ్రీనివాసరావు, వేగిరెడ్డి పాపారావు, వడ్డిల్లి లక్ష్మీ, చింతల వెంకట అప్పారావు, మొవ్వ వేణుగోపాల్, చలసాని శ్రీనివాసరావు, యలమంచిలి మూర్తి, నందిగం స్వామి, ఎస్. కే సాంబశివరావు, తవ్వా పూర్ణచంద్రరావు, దుట్టా శివన్నారాయణ, అరుమళ్ళ కృష్ణారెడ్డి, తాడిశెట్టి శ్రీను, కడవకొల్లు రాజేష్, అవిర్నేని భవాని శంకర్, కొల్లూరు చంద్రకాంత్, వలివేటి కిషోర్, లింగం శ్రీధర్, ఆర్నేపల్లి సూరిబాబు, గరికపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## కానుమోలు గ్రామంలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో సేవ కార్యక్రమాలు

- చలివేంద్రం ఏర్పాటు - ప్రజలకు మజ్జిగ పంపిణీ



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా కానుమోలు గ్రామంలో రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో, మెడిద సుబ్బయ్య ట్రస్ట్ చైర్మన్ ఎం వెంకటేశ్వరావు హైదరాబాద్ సమన్వయంతో వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలు, పాదచారులు, వాహనదారులకు దాహార్తి తీర్చే విధంగా మజ్జిగను శీతల పానీయంగా పంపిణీ చేస్తూ సేవాభావాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కానుమోలు సబ్ రిజిస్ట్రార్ డి. జయరాజ్ హాజరై చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇలాంటి చలివేంద్రాలు వేసవిలో ప్రజలకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయని, ముఖ్యంగా కార్యాలయాలకు వచ్చే ప్రజలకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. సమాజంలో పరస్పర సహకారం పెంపొందించడంలో ఇటువంటి సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయని ఆయన అభిప్రాయపడ్డారు. అలాగే ఈ కార్యక్రమాన్ని సమన్వయంతో నిర్వహిస్తున్న రాణా వెల్ఫేర్ సొసైటీ మరియు మెడిద సుబ్బయ్య ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అతిథులుగా కోఆపరేటివ్ బ్యాంక్ ప్రెసిడెంట్ దన్నే దుర్గారావు, కృష్ణాజిల్లా కురుమ సంఘం ఉపాధ్యక్షుడు దన్నే గాంధీ, శ్రీ మర్రాపు కిరణ్ పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ, సమాజానికి అవసరమైన సేవలను అందించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సూచించారు. చలివేంద్రాన్ని పెద్ద సంఖ్యలో వాహనదారులు, ప్రయాణికులు వినియోగించుకుని దాహార్తిని తీర్చుకున్నారు. ఈ సందర్భంగా రాణా వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర సాంబశివరావు రాయల్ మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు సహాయం అందిస్తామని తెలిపారు.

## శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



**విజయవాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** స్థానిక కస్తూరి భాయి పేటలోని శ్రీ ముత్యాలమ్మ దేవాలయం వద్ద వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చడానికి భక్తులు, దాతల సహకారంతో గత మూడు సంవత్సరాలుగా ఏర్పాటు చేస్తున్న మజ్జిగ చలివెంద్రాన్ని, 24 గంటలు అందుబాటులో ఉండే మంచినీరు కూలర్ ను శుక్రవారం ఆలయం వద్ద ప్రారంభించడం జరిగింది.తొలిరోజు శ్రీ కృష్ణా గ్యాస్ట్రో ఓ లివర్ సెంటర్ డా పాలడుగు హరికృష్ణ, దీప్తి దంపతులు 100 లీటర్ల మజ్జిగ అందించారు.ముత్యాలమ్మ సంక్షేమ సంఘం కమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ వ్యాపారవేత్త, అంజనీ హోటల్ అధినేత, నగర బీసీ నాయకులు ఘంటా శ్రీనివాసరావు, బెజవాడ బార్ అసోసియేషన్ మాజీ కోశాధికారి, ప్రముఖ న్యాయవాది బత్తుల వెంకటేశ్వర్లు, కమిటీ కన్వీనర్ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్ అధ్యక్షుడు బుర్ర వెంకన్న, సెక్రటరీ బింగి యాదయ్య, కోశాధికారి నిమ్మల కుమార్, వైస్ ప్రెసిడెంట్ జటంగి సైదులు, న్యాయ సలహాదారులు కమ్మలపల్లి నాగేశ్వరరావు, కునుకుంట్ల రాంబాబు సభ్యులు వడకల వెంకన్న,మెట్టు గణేష్, మేడబోయిన శ్రీను, కసరబోయిన వినయ్,దాసరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మే నెలలో నాలుగు శుక్రవారాలు మజ్జిగ పంపిణీ నిమిత్తం ఘంటా శ్రీనివాసరావు కమిటీ వారికి నగదు అందచేశారు...

## మానవత్వం చూపించిన హనుమాన్ జంక్షన్ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ

- మరణానంతరం ప్రభుత్వ వైద్య కళాశాలకు దేహాలను అందించే బృహత్తర కార్యక్రమం



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** మానవతా హనుమాన్ జంక్షన్ ద్వారా ఆరుగురు మరణానంతరము దేహాలను అందించే ధ్రువపత్రాలను అందించే కార్యక్రమము శుక్రవారం హనుమాన్ జంక్షన్ మానవతా కార్యాలయంలో నిర్వహించారు.వీరిలో బొర్రా కొండలరావు రాజ్యలక్ష్మి దంపతులు, వడ్డీ రాజేశ్వరరావు రాధా లక్ష్మీ దంపతులు, కూరెళ్ల సుబ్బాచారి,పగడాల రామకృష్ణ ఉయ్యూరు వారు మరణానంతరము తమ దేహాలను ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు అందించే ధ్రువపత్రాలను ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల అనాటమీ ప్రధాన ఆచార్యులు డాక్టర్ శ్యామల కి అందించారు ఈ కార్యక్రమం జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మానవతా రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగినది. డాక్టర్ శ్యామల మాట్లాడుతూ మానవతా అందించే సేవలు అపూర్వమని వైద్య విద్యార్థులకు మరణానంతరం అందించే మృతదేహాలతో ప్రాక్టికల్స్ నేర్చుకుని మంచి డాక్టర్లుగా తయారు చేయుటకు మరియు మృతదేహాలను గౌరవముగా చూసి జాగ్రత్త పరుస్తామని తెలిపారు. వైద్య కళాశాలలో మృతదేహాలను పరిరక్షించే రామారావు మృతదేహాలను పరిరక్షించే విధానాన్ని పవిత్రముగా చూసే విధానాన్ని వివరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి జె వి వి సత్యనారాయణ, మానవతా హనుమాన్ జంక్షన్ కార్యదర్శి పాబోలు గణేష్ బాబు, ఏలూరు రీజనల్ సెక్రటరీ రత్నాకర్ రావు, ఆడిట్ కమిటీ చైర్మన్ కృష్ణారావు, డైరెక్టర్లు వేగిరెడ్డి సూర్యనారాయణ, సుబ్బారావు, పి వి చలం , కొట్నాని రామచంద్రరావు, మల్లికార్జున రావు తదితరులు పాల్గొన్నారు. ధ్రువపత్రాలు అందించిన ఆరుగురిని మానవతా హనుమాన్ జంక్షన్ వారు అభినందించారు.

## కృత్తివెన్ను వీఆర్ఓ నాగమల్లేశ్వరరావు కన్నుమూత...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కృత్తివెన్ను మండలంలో గత 12 సంవత్సరాలుగా వీఆర్వోగా సేవలు అందించిన నాగమల్లేశ్వరరావు(52) శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన గత ఐదు నెలలుగా బ్రెయిన్ క్యాన్సర్ తో పోరాడుతు ఆయన పరిస్థితి విషమించడంతో తుది శ్వాస విడిచారు. కృత్తివెన్ను మండలంలో సుదీర్ఘకాలం పనిచేయడంతో ప్రజలతో నాయకులతో అధికారులతో నాగమల్లేశ్వరరావు కి మంచి అనుబంధం ఉంది. నాగమల్లేశ్వరరావు మృతి పట్ల రాజకీయాలకు అతీతంగా పలువురు నాయకులు కృత్తివెన్ను తాసిల్దార్ శశి కుమార్ వీఆర్వోల సంఘం అధ్యక్షుడు నాగరాజు మరియు ఇతర రెవెన్యూ సిబ్బంది ఆయన మృతి పట్ల దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. ఆయన మృతదేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు.....

## చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతుల మీదగా బోనస్ పంపిణీ కార్యక్రమం



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కోడూరుపాడు పాల ఉత్పత్తి దారుల పరస్పర సహాయక సహకార సంఘం నందు 2025 - 2026 ఆర్థిక సంవత్సరం కు గాను మూడవ విడత నాలుగు నెలల బోనస్ 2,19,122 రూపాయలను 74 మంది పాల ఉత్పత్తి దారులకు చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతులమీదుగా అందజేశారు. తదనంతరం అరుకా క్యాపిటల్ కంపెనీ సింగపూర్ వారి సౌజన్యంతో సిస్టమ బయో వారు మరియు కృష్ణా మిల్క్ యూనియన్ వారి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బయోగ్యాస్ ను చైర్మన్ చలసాని ఆంజనేయులు చేతులమీదుగా ప్రారంభించడం జరిగింది. పశు వ్యర్థాల నుండి బయోగ్యాస్ ఉత్పత్తి చేయుటకు కృష్ణా మిల్క్ యూనియన్ శ్రీకారం చుట్టి ఈ రోజు బాపులపాడు మండలం, కోడూరుపాడు గ్రామంలో పాడి రైతు ఇంట్లో నూతన బయోగ్యాస్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్రస్తుత యుద్ధ పరిస్థితులు మరియు ఇంధన సంక్షోభ దృష్ట్యా పునరుత్పాదక శక్తి వనరులను ప్రోత్సహించుటకు, ఇంధన వ్యయాలను తగ్గించుటకు మరియు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుటకు ఈ బయోగ్యాస్ ప్రాజెక్ట్‌ను కృష్ణా మిల్క్ యూనియన్ పరిధిలోని అన్ని గ్రామాలలో దశలవారీగా అమలు చేస్తామని తెలిపారు. పాడి పశువులకు ఎద చూసి సెమెన్ చెయ్యడానికి ప్రాణ గన్ ను , పాడి పశువులకు చూడి నిర్ధారణ లో నూతన విధానం సిబిటి ని చలసాని ఆంజనేయులు ప్రారంభించారు. తదనంతరం బండారు సత్యనారాయణ కుమారుడు వివాహం సందర్భంగా 20,000/- రూపాయల బంగారు నాణెమును అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కళ్ళే వెంకటేశ్వరరావు, వెటర్నరీ డి డి లింగం ప్రసాద్, మేనేజర్ మాగంటి హరిబాబు, వెటర్నరీ డాక్టర్ లు , సూపర్ వైజర్ లు , సెమెన్ వర్కర్లు,పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

**కృత్తివెన్ను,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కృతి వెన్ను లక్ష్మీపురం సబ్ స్టేషన్ లకు సరఫరా అయ్యే 33ఎజ కృత్తివెన్ను ఫీడర్ను మెయింటనెన్స్ నిమిత్తం శనివారం లక్ష్మీపురం సబ్ స్టేషన్ లో బే ఎక్స్టెన్షన్ కొరకు ఈ క్రింది తెలిపిన సమయంలో సరఫరా నిలిపివేయబడును. కృతి వెన్ను సబ్ స్టేషన్ సమయం ఉదయం 8.00 గంటల నుండి 10.30 వరకు.అలాగే లక్ష్మీపురం సబ్ స్టేషన్ సమయం ఉదయం 8.00 గంటల నుండి 12:00 గంటల వరకు మరియు మధ్యాహ్నం 15:00 నుండి 18:00 వరకు కావున వినియోగదారులు మరియు ఆక్వా రైతులు పైన తెలిపిన సమయాన్ని గమనించి సహకరించగలని జి గోవింద రావు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మచిలీపట్నం ఒక ప్రకటన లో తెలిపారు

## పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన అయ్యప్ప మిత్ర మండలి



**విస్సన్నపేట,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో హిందుస్థాన్ ఏజెన్సీ నిర్వాకుడు పెరుగు నరసింహారావు జన్మదిన ఉత్సవ వేడుకలను అయ్యప్ప స్వామి మిత్ర మండలి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జన్మదినోత్సవ కేకు కట్ చేసిన అనంతరం వార్డు మెంబర్ లకుశీ పవన్ ఆయనకు తినిపించారు. ఈ కార్యక్రమంలో పోతురాజు గోపి, షేక్ మహబూబ్ సుభాని, రాంబాబు తదితరులు జన్మదినోత్సవ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ పవన్ మాట్లాడుతూ సేవే లక్ష్యంగా హిందుస్థాన్ సంస్థ ఆధ్వర్యంలో గుప్త దానాలు చేయటం నరసింహారావు అలవాటు అని తమ భాగస్వామ్య సంస్థ ద్వారా మహాప్రస్థానానికి ఒక వెహికల్ విరాళంగా ఇచ్చారని తాము సంపాదించిన సంపాదనలో కొంత లాభాన్ని పేదలకు పంచటం ఆనవాయితీగా చేసుకున్నారని పేద కుటుంబాలకు అందించే సేవను ఆయన అయ్యప్ప స్వామి సేవగా భావిస్తారన్నారు.

## శ్రీమన్నారాయణ మహాయజ్ఞమునకు తరలి రండి..



**కోడూరు,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** శ్రీమన్నారాయణ ఆలయ రాజగోపుర కుంభప్రోక్షణ సందర్భమున ఈనెల 19 నుండి 29 వరకు జరుగు శ్రీమన్నారాయణ మహాయజ్ఞమునకు భక్తులు తరలి రావాలని శ్రీ అష్టక్షరి రామానుజ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. (TSR) 13 యాగశాలలో 108 హోమ గుండాల ద్వారా మహాయజ్ఞం చేస్తున్నామన్నారు ఇష్టి హోమగుండాల వద్ద కోటి అష్టాక్షరీ మంత్ర హవనం చేస్తున్నట్లు వివరించారు.

## గోవింద నామస్మరణతో మారుమోగిన వెంకటేశ్వరుని ఆలయం



**కోడూరు, ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కోడూరు వెంకటేశ్వర స్వామి వారి ఆలయం వద్ద ధ్వజస్తంభ పునః ప్రతిష్ట, మహోత్సవాలలో మూడవరోజు శుక్రవారం గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణం మారు మోగింది. తిరువారాధన, విష్వక్సేన పూజ,పుణ్యాహవచనము, యాగశాల అర్చన,హోమములు, ధ్వజస్థంభమునకు అదివాసములు, వేద పండితులు మంత్రోత్సరణ మధ్య భక్తి ప్రపత్తులతో సాగింది. ఈ కార్యక్రమాలలో భాగంగా రేపు ఉదయం 8:47 ని,, ధ్వజస్తంభ పునః ప్రతిష్ట, మహా కుంభాభిషేకం, అనంతరం భారీ అన్న సుమారాధన నిర్వహిస్తున్నట్లు ఆలయ ట్రస్టీ కోట పద్మా వతి వర ప్రసాద్ తెలిపారు.

## సీసీ రోడ్ల నిర్మాణం, డ్రైనేజీల మరమ్మతులు వేగవంతంగా పూర్తి చేయండి

**-అధికారులకు మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి వినతి**



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ):**గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపనపల్లి,సాయిరామ్ నగర్ కాలనీల్లో నెలకొన్న సీసీ రోడ్లు, డ్రైనేజ్ సమస్యల పరిష్కారానికి మాజీ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి శుక్రవారం సంబంధిత శాఖ అధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేపట్టారు.కాలనీవాసులు రోడ్ల దుస్థితి, వర్షాకాలంలో నిల్వ ఉండే మురుగు నీరు,డ్రైనేజీ అడ్డంకుల వల్ల ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకువచ్చారు.సమస్యలను పరిశీలించిన గంగాధర్ రెడ్డి వెంటనే జలమండలి,జిహెచ్ఎంసీ అధికారులకు సీసీ రోడ్ల నిర్మాణం,డ్రైనేజ్ మరమ్మతులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రజల మౌలిక సదుపాయాలే ప్రథమ ప్రాధాన్యమని,భూగర్భ డ్రైనేజీ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.ప్రజల వినతులు, స్థానిక సమస్యలను పరిగణలోకి తీసుకుని డివిజన్ అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.అత్యవసర ప్రాంతాల్లో,నిత్యం నీరు పొంగే చోట్ల పనులను ప్రాధాన్యతగా పూర్తి చేస్తామని చెప్పారు. పాత ఓపెన్ నాలాల సమస్యలను దృష్టిలో పెట్టుకుని వాటి స్థానంలో ఆర్‌సీసీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు ప్రారంభించినట్లు వెల్లడించారు.కాలనీలలో మౌలిక వసతులు కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ వాటిని సమస్య రహిత ఆదర్శ కాలనీలుగా తీర్చిదిద్దడమే లక్ష్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో జలమండలి మేనేజర్ ఈశ్వర్ కుమార్, నాయకులు రమేష్,శేఖర్, శ్రీశైలం,నర్సింగ్ రావు,సూపర్వైజర్ సురేష్, లైన్‌మ్యాన్ శ్రీకాంత్, స్థానికులు పాల్గొన్నారు.

## మందుబాబులకు కోర్టు షాక్!!

**● డ్రంక్ అండ్ డ్రైవ్‌లో ఒకరికి జైలు శిక్ష ● మద్యం తాగి స్టీరింగ్ పడితే జైలుకే ● హెల్మెట్ లేకున్నా, రాంగ్ రూట్‌లో వెళ్లినా చర్యలు తప్పవు ● సిఐ రాజేశ్వరరావు హెచ్చరిక**

**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన ఏడుగురు వ్యక్తులను గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు హాజరుపరచగా, వారిలో ఆరుగురికి కలిపి మొత్తం 12,000 రూపాయల జరిమానా విధించారు. మద్యం తాగి వాహనం నడుపుతూ రెండోసారి పట్టుబడిన ఒక వ్యక్తికి కోర్టు మూడు రోజుల జైలు శిక్ష విధించడంతో అతడిని కరీంనగర్ జిల్లా జైలుకు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ..... ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహన పత్రాలను వెంట ఉంచుకోవాలని, అతివేగంగా, రాంగ్ రూట్‌లో ప్రయాణించి ప్రాణాల మీదకు తెచ్చుకోవద్దని ఆయన సూచించారు. నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్టరీత్యా కఠినంగా వ్యవహరిస్తామని ఈ సందర్భంగా రాజేశ్వరరావు స్పష్టం చేశారు.

## ప్రమాద రహిత సింగరేణిని సాకారం చేద్దాం!!

**హై టెన్షన్ సబ్-స్టేషన్ల నిర్వహణపై సాంకేతిక అవగాహన**

**సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ భద్రతా ప్రమాణాలు పాటించాలి**

**డీడీఎంఎస్ కమలేష్ చౌదరి**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)**సింగరేణి రామగుండం ఏరియా-1 పరిధిలోని టి.టి.సి నందు శుక్రవారం గనులలో విద్యుత్ భద్రత, హెచ్.టి సబ్-స్టేషన్ల నిర్వహణపై ఒక రోజు అవగాహన సదస్సుకు హైదరాబాద్ డీడీఎంఎస్ కమలేష్ చౌదరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గనులలో పనిచేసేటప్పుడు విద్యుత్ ప్రమాదాల నివారణకు అత్యున్నత భద్రతా ప్రమాణాలు పాటించాలని, హై టెన్షన్ సబ్-స్టేషన్ల నిర్వహణలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సూచించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండటం ద్వారానే ప్రమాద రహిత సింగరేణిని సాకారం చేయవచ్చని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ రామమోహనరావు, టిటిసి మేనేజర్ అశోక్ రావు, వివిధ గనుల ప్రాజెక్ట్ ఇంజనీర్లు, డీజీఎంలు, సేఫ్టీ ఆఫీసర్లు, ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని అవగాహన పొందారు.

## ఓడిపోవడం కాదు... ఓ పాఠం!!




ఓడిపోవడం తప్పు కాదు,
అక్కడితో ఆగిపోవడమే తప్పు.
పడిపోతే నేల చూపిస్తుంది,
లేచే మార్గం ఎక్కడో!!
ప్రయత్నం మానేసిన క్షణమే,
నిజమైన
ఓటమి మొదలవుతుంది.
గెలుపు అనేది ముగింపు కాదు,
మరొక
ప్రయాణానికి ఆహ్వానం!!
చెమట చుక్కల్లోనే
సాఫల్యం విత్తనం
దాగి ఉంటుంది.
నిన్నటి వైఫల్యం,
రేపటి విజయం కోసం గురువు.
ఆగకుండా నడిచే అడుగులకే,
గమ్యం తలుపులు తెరుస్తుంది!!
భయం అనేది నీడ మాత్రమే,
నువ్వు నడిస్తే అది
వెనకే ఉంటుంది.
కష్టాలు కరిగిపోయే మంచు,
ధైర్యం వేడి తగిలితే.
మళ్లీ లేవగలిగితేనే మనిషి,
మళ్లీ గెలవగలిగితేనే విజేత!!

**గడ్డం సంతోష్ రాజ్**

గోదావరిఖని, 9849555485

# నిరుద్యోగ యువతకు ఎన్టీపీసీ బంపర్ ఆఫర్!!

**● ఆరు నెలల ఉచిత పోటీ పరీక్షల శిక్షణ ● క్యూఆర్ కోడ్‌తో సులభంగా నమోదు ● త్వరపడండి.. పరిమిత సీట్లు మాత్రమే**




**పెద్దపల్లి/ ఎన్టీపీసీ: ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)**ఎన్టీపీసీ రామగుండం హెచ్‌ఆర్-సీఎస్‌ఆర్ విభాగం స్థానిక యువత ఉజ్వల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం ప్రత్యేకంగా ఆరు నెలల ఉచిత కోచింగ్ కార్యక్రమాన్ని ప్రకటించింది. దీప్తి మహిళా సమితి సహకారంతో నిర్వహించబడుతున్న ఈ శిక్షణ ద్వారా నిరుద్యోగ యువతకు నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన విద్యను అందించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రభుత్వ, ఇతర పోటీ పరీక్షల్లో విజయం సాధించాలనుకునే ఆసక్తి గల అభ్యర్థులు వెంటనే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సంస్థ కోరుతోంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సులభతరం చేసేందుకు ఒక క్యూఆర్ కోడ్‌ను విడుదల చేశారు, దీనిని స్కాన్ చేయడం ద్వారా అభ్యర్థులు తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. ఈ శిక్షణ తరగతులకు కేవలం పరిమిత సీట్లు మాత్రమే అందుబాటులో ఉన్నందున, అర్హులైన అభ్యర్థులు ముందుగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. స్థానిక నిరుద్యోగుల సాధికారత కోసం ఎన్టీపీసీ చేపట్టిన ఈ సామాజిక బాధ్యత కార్యక్రమం ఎంతో ప్రశంసనీయంగా నిలుస్తోంది. శిక్షణకు సంబంధించిన ఇతర వివరాల కోసం సంస్థ ప్రతినిధులను సంప్రదించవచ్చు లేదా అధికారిక నోటీసు బోర్డులను గమనించవచ్చు. యువత ఈ అద్భుతమైన అవకాశాన్ని అందిపుచ్చుకుని తమ లక్ష్యాలను చేరుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షిస్తున్నారు. నమోదు ప్రక్రియ ప్రారంభమైనందున ఆసక్తి గల వారు ఆలస్యం చేయకుండా వెంటనే తమ పేర్లను నమోదు చేసుకోవడం ఉత్తమం. ఎన్టీపీసీ దీప్తి మహిళా సమితి చేపట్టిన ఈ చొరవ స్థానిక ప్రాంతంలో విద్యా విప్లవానికి బాటలు వేయనుంది.

# ప్రవేశ పరీక్షకు సర్వం సిద్ధం!!

**ఏప్రిల్ 19న ఎగ్జామ్**

**100 మార్కుల ఓఎంఆర్ టెస్ట్**

**లింగాపూర్ తెలంగాణ మోడల్ స్కూల్, ప్రిన్సిపాల్ సదానందం**

**పెద్దపల్లి/ రామ: ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ మోడల్ పాఠశాలల్లో 2026-27 విద్యాసంవత్సరానికిగాను 6 నుండి 10వ తరగతి వరకు ప్రవేశాల కోసం నిర్వహించే పరీక్ష ఏప్రిల్ 19వ తేదీన జరగనుంది. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్ టికెట్లను అభ్యర్థులు ఏప్రిల్ 10 నుండి అధికారిక వెబ్‌సైట్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని లింగాపూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ పంబాల సదానందం తెలిపారు. పరీక్షా సమయాల విషయానికి వస్తే, 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుండి 12 గంటల వరకు, 7 నుండి 10వ తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 నుండి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించబడుతుంది అని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ లింగాపూర్‌లోని తెలంగాణ మోడల్ స్కూల్ పరీక్షా కేంద్రానికి హాజరు కావాల్సి ఉంటుంది. మొత్తం 100 ఆబ్జెక్టివ్ ప్రశ్నలతో కూడిన ఈ పరీక్షలో సమాధానాలను ఓఎంఆర్ షీట్లపై గుర్తించాలి. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్, ఎగ్జామ్ ప్యాడ్, బాల్ పెన్నులు, వాటర్ బాటిల్ మాత్రమే తీసుకురావాలని, ఇతర వస్తువులకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సరైన సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకుని నిబంధనలు పాటించాలని ప్రిన్సిపాల్ సూచించారు. అభ్యర్థులు మరింత సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను సంప్రదించవచ్చు. సమయ పాలన పాటిస్తూ హాల్ టికెట్‌పై ఉన్న సూచనలను చదువుకుని పరీక్షకు సిద్ధం కావాలని కోరారు. రామగుండం పరిసర ప్రాంత విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

# ఆర్టిజన్ల పోరుకు బీజేపీ సంఘీభావం!!

**● ఒకే సంస్థ.. రెండు చట్టాలా? ● 20 వేల కుటుంబాల భవిష్యత్తుతో చెలగాటం వద్దు ● కందుల సంధ్యారాణి**



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)**తెలంగాణ విద్యుత్ రంగంలో పనిచేస్తున్న 20 వేల మంది ఆర్టిజన్ల న్యాయమైన డిమాండ్ల సాధనకై రామగుండం సర్కిల్ కార్యాలయం ఎదుట చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం మూడవ రోజుకు చేరగా, బీజేపీ నేత కందుల సంధ్యారాణి వారికి సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రాణాలకు తెగించి రాష్ట్రానికి వెలుగులు పంచుతున్న ఆర్టిజన్లను పాత ఏపీ సెబ్ నిబంధనల ప్రకారం వెంటనే క్రమబద్ధీకరించాలని, వారిని సెకండ్ గ్రేడ్ కార్మికులుగా చూడటం రాజ్యాంగ విరుద్ధమని మండిపడ్డారు. గతంలో విద్యార్హతల ఆధారంగా కన్వర్షన్ ప్రక్రియ చేపట్టిన ప్రభుత్వం, ఇప్పుడున్న కార్మికుల పట్ల మొండివైఖరి ప్రదర్శించడం వారి శ్రమను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే సంస్థలో రెండు రకాల చట్టాలు చెల్లవని, సమాన పనికి సమాన గౌరవం దక్కాలని కోరుతూ 12(3) ఒప్పందం ప్రకారం తక్షణమే ఉత్తర్వులు జారీ చేయాలని ఆమె డిమాండ్ చేశారు. 20 వేల కుటుంబాల భవిష్యత్తుతో చెలగాటం ఆడితే సహించబోమని, న్యాయం జరిగే వరకు అసెంబ్లీ నుండి సెక్రటేరియట్ వరకు బీజేపీ పక్షాన పోరాటాన్ని ఉధృతం చేస్తామని సంధ్యారాణి హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఆర్టిజన్ల జీవితాల్లో వెలుగులు నింపాలని, లేనిపక్షంలో ప్రత్యక్ష ఉద్యమం తప్పదని ఆమె ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# ఘనంగా డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ



**మియాపూర్,ఏప్రిల్ 10 (వార్తాప్రభ):**మియాపూర్ బస్ డిపో వద్ద ఆర్‌టీసీ యూనియన్ ఆధ్వర్యంలో డా.బి.ఆర్. అంబేద్కర్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొండా విశ్వేశ్వర్ రెడ్డి హాజరయ్యారు.ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, బీజేపీ నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి,శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ మాట్లాడుతూ డా.బి.ఆర్.అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా,సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన మహానుభావుడని పేర్కొన్నారు.అంబేద్కర్ కేవలం వ్యక్తి మాత్రమే కాదని,సమానత్వం,విద్య, స్వాభిమానం అనే విలువలకు ప్రతీక అని తెలిపారు."శిక్షణ పొందండి,పోరాడండి,సంఘటితమవండి" అనే ఆయన సందేశం నేటికీ ప్రతి ఒక్కరికీ మార్గదర్శకమని,అణగారిన వర్గాల హక్కుల కోసం చేసిన కృషి అపారమని అన్నారు.ఆయన విగ్రహం ఒక శిల్పం మాత్రమే కాకుండా ఆశయాలకు ప్రతీకగా నిలుస్తుందని చెప్పారు.దేశంలో అంబేద్కర్ ఆశయాలను అమలు చేస్తున్నది బీజేపీ మాత్రమేనని,కేంద్ర ప్రభుత్వం ఆయనకు భారతరత్న ప్రదానం చేసి గౌరవించిందని తెలిపారు. 2018లో నిలిచిపోయిన విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.ఈ కార్యక్రమంలో కాంతి కిరణ్,కాంచన కృష్ణ, చెన్నయ్య,థామస్,యాదయ్య, మహంకాళి,వెంకటేష్,లక్ష్మయ్య, నాగరాజు,మాణిక్ రావు,నాగేశ్వర్ గౌడ్,మహేష్ యాదవ్,ఆకుల లక్ష్మణ్,గుండె గణేష్ ముదిరాజ్,వేణుగోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు

# షార్ట్ సర్క్యూట్‌తో వీధినపడ్డ నిరుపేద కుటుంబం.

**కట్టుబట్టలతో మిగిలిన ముగ్గురు పిల్లలు, తల్లి**





ప్రభుత్వం తక్షణమే స్పందించి, ఆర్థికంగా ఆదుకోవాలని బస్తీ వాసులు ముఖ్యంగా జవహర్ నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

**జవహర్ నగర్ ఏప్రిల్ 10: (వార్తా ప్రభ)**విధి వంచించిన ఆ కుటుంబాన్ని అగ్నిప్రమాదం మరింత కుంగదీసింది. కష్టపడి సంపాదించుకున్న రూపాయి రూపాయి పోగేసి కొనుక్కున్న వస్తువులు, పిల్లల భవిష్యత్తుకు ఆధారం కావాల్సిన సర్టిఫికెట్లు అగ్నికి ఆహుతయ్యాయి. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్ నగర్ లోని బి జే ఆర్ నగర్‌లో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికులను కన్నీరు పెట్టించింది.స్థానిక నివాసి అయిన రాధ అనే మహిళ, తన భర్త చనిపోవడంతో ముగ్గురు పిల్లలను సాకుతూ ఇళ్లల్లో పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం ప్రమాదవశాత్తు ఇంట్లో షార్ట్ సర్క్యూట్ సంభవించి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు ఇల్లంతా వ్యాపించాయి.ఈ ప్రమాదంలో రాధ కుటుంబానికి కోలుకోలేని దెబ్బ తగిలింది. సుమారు 6, లక్షల రూపాయల వరకు ఆస్తి నష్టం జరిగిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం వ్యక్తం చేసింది.పిల్లల విద్యా సర్టిఫికెట్లు, ఆధార్ కార్డులు పూర్తిగా కాలిపోయాయి.ఇంట్లో భద్రపరుచుకున్న పావు తులం బంగారం, దాచుకున్న నగదు బుగ్గిపాలయ్యాయి. బట్టలు, గృహోపకరణాలు, నిత్యావసర వస్తువులు అన్నీ బూడిదయ్యాయి.భర్త లేని తరుణంలో, ఇళ్లల్లో బట్టలు ఉతుకుతూ, పనులు చేస్తూ పిల్లలను చదివిస్తున్న రాధకు ఇప్పుడు తలదాచుకోవడానికి నీడ కూడా లేకుండా పోయింది. ప్రస్తుతం ఆ కుటుంబం కట్టుబట్టలతో వీధిన పడింది.చాలా కష్టపడి పిల్లలను పెంచుకుంటున్నాను. ఈ ప్రమాదం నన్ను కోలుకోలేని దెబ్బ తీసింది. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి," బాధితురాలు రాధ కన్నీటిపర్యంతమయ్యారు.ఈ విషయం తెలుసుకున్న బస్తీవాసులు, రాధ పరిస్థితిని చూసి చలించిపోయారు. తీవ్ర ఇబ్బందుల్లో ఉన్న ఈ నిరుపేద కుటుంబాన్ని

వార్తా ప్రభ

# హైదరాబాద్

## అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయండి -జోనల్ కమిషనర్ ఆదేశం



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ):**సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ శేరిలింగంపల్లి జోన్‌లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని జోనల్ కమిషనర్ హేమంత్ బోర్ఖడే అధికారులకు స్పష్టం చేశారు.శుక్రవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో పెండింగ్ పనులు, 99 రోజుల ప్రణాళిక లక్ష్యాల అమలుపై దిశానిర్దేశం చేశారు.ఇంజనీరింగ్ విభాగానికి 50 శాతం పూర్తయిన పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని,రోడ్ల గుంతలపై ప్రతి 15 రోజులకు నివేదిక ఇవ్వాలని ఆదేశించారు.ఏప్రిల్ 15లోగా పూడికతీత పనులు ముగించాలని చెప్పారు.పార్కులు,క్రీడల విభాగం అమీన్‌పూర్ పార్కుపనులను పరిశీలించి,నెలాఖరులోగా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని సూచించారు.కొత్త స్టేడియాల కోసం ఖాళీ స్థలాల వివరాలను వెంటనే సమర్పించాలని పేర్కొన్నారు.టౌన్ ప్లానింగ్ విభాగం పటాన్‌చెరు పరిధిలో పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని,ఖాజాగూడలోని ఎంజేఆర్ భవనంపై స్ట్రక్చరల్ అనాలిసిస్ కోసం జేఎన్‌టీయూ అధికారులకు లేఖ రాయాలని ఆదేశించారు.జంక్షన్ల అభివృద్ధిలో భాగంగా ఫుట్‌పాత్‌లు,మీడియన్ పెయింటింగ్ పనులపై సర్కిల్ వారీగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు.ట్రాఫిక్ పోలీసులు గుర్తించిన 18 నీటి నిల్వ ప్రాంతాల్లో శాశ్వత పరిష్కారాలు చేపట్టాలని చెప్పారు.ప్రజల ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని, ముఖ్యంగా టౌన్ ప్లానింగ్,ఇంజనీరింగ్ విభాగాలపై వారానికోసారి సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. అభివృద్ధి పనుల్లో జాప్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ సమావేశంలో ఉప కమిషనర్లు,ఎస్ఈలు, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు కార్మిక భవన్ ఏర్పాటుకు సహకరిస్తా.

**కార్మిక భవన నిర్మాణానికి వజ్రేశ్ యాదవ్ సానుకూలత**



**జవహర్ నగర్ ఏప్రిల్ 10: (వార్తా ప్రభ)** జవహర్ నగర్ లో భవన నిర్మాణ కార్మికుల కొరకు కార్మిక భవన్ ఏర్పాటుకు సహకరిస్తానని మేడ్చల్ డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తోటకూర వజ్రేశ్ యాదవ్ ను జవహర్ నగర్ డివిజన్ భవన నిర్మాణ కార్మిక సంఘం కమిటీ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ వారితో మాట్లాడుతూ కార్మికుల కోసం ప్రత్యేకంగా లేబర్ అడ్డా' స్థలం కేటాయించాలని అక్కడ భవన నిర్మాణానికి సహకరించాలని వారు వినతిపత్రం అందజేశారు.కార్మికుల విజ్ఞప్తిపై వజ్రేశ్ యాదవ్ సానుకూలంగా స్పందించారు. వెంటనే సంబంధిత ఉన్నతాధికారులతో ఫోన్ ద్వారా మాట్లాడి, కార్మికుల సమస్యలను వివరించారు. త్వరలోనే అధికారులతో క్షేత్రస్థాయిలో సమావేశమై, భవన నిర్మాణానికి అవసరమైన స్థల సేకరణ మరియు ఇతర అనుమతులు లభించేలా చూస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, సంఘ ప్రతినిధులు అధ్యక్షులు చెన్నాపురం యాదయ్య, గౌరవ అధ్యక్షులు కొయ్యడ వెంకటేష్, ప్రధాన కార్యదర్శి బూడిద వెంకటేష్-సభ్యులు సలహాదారులు రమణ రెడ్డి, మల్లేష్ (ఏ ఐ ఎఫ్ టీ యూ, కోశాధికారి కోట్ల చెన్నా రెడ్డి, మరాఠి బాబు, ఐలయ్య పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.కార్మికుల సంక్షేమానికి తమ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా వజ్రేశ్ యాదవ్ వారితో స్పష్టం చేశారు.

## ఆదివారం ఉచిత వైద్య శిబిరం.



**కూకట్ పల్లి,ఏప్రిల్ 10(వార్తాప్రభ):**మెడికోవార్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కూకట్ పల్లి వివేకానంద కాలనీలోని సీనియర్ సిటిజన్ పార్కు నందు ఆదివారం ఫ్రీ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. మల మూత్ర పరీక్షలు,రక్త పరీక్షలు, ఈసీజీ, డెంటల్,ఐ చెకప్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులచే ఈ పరీక్షలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు ఉదయం 5:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతున్నట్లు తెలిపారు. అవసరమైన వారందరూ తప్పకుండా ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

# ఎడిటోరియల్

## భోగాపురం ఎయిర్ పోర్టుకు రెక్కలు రెడీ !

ఉత్తరాంధ్రకు తలమానికం అయిన భోగాపురం భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం తొందరలోనే ఆపరేషన్స్ కి రెడీ అవుతోంది. ఈ ఏడాది జనవరి 4న ట్రయల్ రన్ పూర్తి చేసుకుని రాష్ట్ర అభివృద్ధికి శుభారంభం చేసిన భోగాపురం ఎయిర్ పోర్టు తొందరలోనే పూర్తి స్థాయి ఆపరేషన్స్ కి అవసరం అయిన హంగులు సిద్ధం చేసుకుంటోంది. విశాఖ నుంచి భోగాపురం ఎయిర్ పోర్టుకు వెళ్ళాలంటే రద్దీ పెద్దగా లేకపోతే గంటా 12 నిముషాలు పడుతుంది. 46 కిలోమీటర్ల దూరంలో ఈ ఎయిర్ పోర్టు ఉంది. అందుకే ఈ ఎయిర్ పోర్టు నుంచి కొత్తగా అప్రోచ్ రోడ్లను వేసి మరీ వీలైనంత వరకూ రద్దీని క్రమబద్ధీకరించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా ఉన్న ఏడు ప్రాధాన్య రహదారులను జూన్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు చెబుతున్నారు. పనులు వేగంగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఎయిర్ పోర్టు కనెక్టివిటీ : ఇక భోగాపురం నుంచి ఇతర ప్రాంతాలకు ఎయిర్ పోర్టు కనెక్టివిటీ కోసం విఎంఆర్డీఏ, జీవీఎంసీ, ఆర్ అండ్ బి వంటి సంస్థలు సంయుక్తంగా చేపట్టిన ఏడు కీలక రహదారి పనులు ప్రస్తుతం అక్కడ శరవేగంగా కొనసాగుతున్నాయి. భీమిలీ దగ్గర ఉన్న తిమ్మాపురం నుంచి విశాఖ శివారు అయిన మారికవలస వరకు 6.3 కిలోమీటర్ల రహదారి పనులు పూర్తి కావడానికి చేరువలో ఉన్నాయి. అలాగే అదే విధంగా అడవివరం నుంచి శొంఠ్యాం వరకు నిర్మిస్తున్న ఆరు లైన్ల ప్రధాన రహదారి నగరానికి కీలకంగా మారబోతోంది. అడవివరం శొంఠ్యాం రహదారిలో కొంతభాగం అటవీ భూమి ఉండటంతో అనుమతుల ప్రక్రియ ప్రస్తుతం కొనసాగుతోందని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాల నుంచి అనుమతులు త్వరలో లభిస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇక ఈ ఎయిర్ పోర్టు కనెక్టివిటీ రోడ్లు సగానికి పైగా పూర్తి అయిపోయాయని తెలుస్తోంది. నేరళ్ళవలస కొత్తవలస రహదారి 65 శాతం ఏప్రిల్ నెలాఖరుకల్లా పూర్తవుతోంది. అలాగే బోయపాలెం నుంచి కాపులుప్పాడ వరకు నాలుగు లైన్ల రహదారి పనులు 66 శాతం మేర పూర్తయ్యాయని ఇవి కూడా ఏప్రిల్ చివరి నాటికి అందుబాటులోకి వస్తాయని అధికారులు చెబుతున్నారు. ఇక భీమిలి దొరతోట రహదారిని 100 అడుగుల వెడల్పుతో అభివృద్ధి చేయనున్నట్లుగా అధికారులు వెల్లడించారు. అలాగే పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని వేపకొండ పెందుర్తి రహదారి పనులు విఎంఆర్డీఏ జీవీఎంసీ కలసి చేపడుతున్నాయి. మే నెల చివరికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని అధికారులు చెబుతున్నారు. అలాగే వేపగుంట నుంచి జుత్తాడ వరకు రహదారి పనులు జూన్ నాటికి పూర్తవుతాయని అంటున్నారు. అద్భుతమైన ప్రయాణం : ఇక అడవివరం శొంఠ్యాం రహదారి తప్ప మిగతా అన్ని రహదారులకు జాతీయ రహదారి కనెక్టివిటీకి అంగీకారం లభించిందని అధికారులు అంటున్నారు. ఈ కనెక్టివిటీ రోడ్లు అన్నీ పూర్తి అయితే ఎక్కడ నుంచి అయినా భోగాపురం ఎయిర్ పోర్టుకు చేరుకోవడం చాలా ఈజీ అవుతుంది, అంతే కాదు అద్భుతమైన ప్రయాణం అనుభూతిని కూడా పొందుతారు అని అంటున్నారు ఇక కేవలం ఎయిర్ పోర్టు కనెక్టివిటీకి మాత్రమే కాదు ఈ రహదారుల వల్ల మొత్తం ఈ ప్రాంత ప్రజలకు ప్రయాణ సౌకర్యం బాగా మెరుగుపడుతుందని అధికారులు చెబుతున్నారు. జూన్ నాటికి ఈ మొత్తం పనులు పూర్తయ్యేలా లక్ష్యం పెట్టుకుని ముందుకు సాగుతున్నారు. ఇక వీటికి అదనంగా భారీ వంతెనల నిర్మాణ పనులు కూడా సమాంతరంగా జరుగుతున్నాయని అధికారులు వెల్లడించారు.

## షా బుఖారి ఆస్థానలో ఘనంగా ఎమ్మెల్యే వసంత జన్మదిన వేడుకలు

**పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించిన అల్తాఫ్ బాబా**





**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** కొండపల్లి పట్టణంలోని సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా ఆస్థాన పీఠాధిపతి అల్తాఫ్ బాబా ఆధ్వర్యంలో మైలవరం శాసన సభ్యుడు వసంత వెంకట కృష్ణ ప్రసాద్ జన్మదిన వేడుకలు గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వసంతకు సాదర స్వాగతం పలికిన అల్తాఫ్ బాబా పుష్పగుచ్ఛం అందించి దుశ్శాలువాతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం భారీ కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. పుణ్యక్షేత్రంలో అందరి మధ్య ఆప్యాయంగా జన్మదిన వేడుకలు జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. అనంతరం ఇబ్రహీంపట్నం సీఐ ఎ.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఎస్సైలు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందించి, దుశ్శాలువాతో సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వసంతను సత్కరించి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపిన వారిలో కేతనకొండ గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ పాస్టర్ ఎం.ఎలీషా, సీనియర్ పాత్రికేయులు బి.డేవిడ్ రాజు, ఎస్.కె.బాషా, హఫీజ్ ఖాద్రీ, టీడీపీ జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి ఎం.డి.అఫ్సర్, కో - ఆప్షన్ మెంబర్ మహబూబ్ సుభాని, మండల మైనార్టీ నాయకులు జీలాని తదితరులు ఉన్నారు.

## ఈ నెల 16 నుంచి దోకుపర్తిలో ఉచిత వేసవి శిక్షణ తరగతులు



**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 10:(వార్తా ప్రభ ప్రతినిధి)**మహిళలు, బాల బాలికల కోసం తమ స్కూల్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో ఉచిత వేసవి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎస్.కె.పి.వి.వి దోకుపర్తి ఉపేంద్ర హై స్కూల్ ప్రిన్సిపాల్ పి.శ్యామల చెప్పారు. శుక్రవారం పాఠశాల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో శిక్షణ తరగతుల గోడపత్రికను తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బొమ్మసాని సుబ్బారావుతో కలిసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం శ్యామల మాట్లాడుతూ ఏప్రిల్ 16 నుంచి మే 31వ తేదీ వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఈ తరగతులు జరుగుతాయని, ఎటువంటి ట్యూషన్ ఫీజు లేకుండా పూర్తి ఉచితంగా ఈ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. బొమ్మసాని సుబ్బారావు మాట్లాడుతూ మహిళలు, బాలబాలికలు వేసవి కాలాన్ని సద్వినియోగం చేసుకుని, వివిధ అంశాల్లో తమ నైపుణ్యాలను మెరుగుపరచుకునేందుకు ఈ శిక్షణ తరగతులను పూర్తి ఉచితంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇన్చార్జి సెక్రటరీ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ మహిళలకు కంప్యూటర్ బేసిక్స్, మెహందీ, స్పోకెన్ ఇంగ్లిషు, బ్యూటీషియన్, జ్యూయలరీ మేకింగ్, మగ్గం వర్క్స్ అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. బాలబాలికలకు వేదిక్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ బేసిక్స్, స్పోకెన్ ఇంగ్లిషు, పెయింటింగ్, డ్రాయింగ్, వెస్టర్న్ డ్యాన్స్, చెస్, స్కేటింగ్, బాస్కెట్ బాల్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. హిందూ హైస్కూల్స్ కమిటీ ప్రెసిడెంట్ టి .శేషయ్య, జనరల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ గోపిశెట్టి మల్లయ్య, ట్రెజరర్ గోళ్ళ బాబా విజయకుమార్ , హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు, వైస్ ప్రిన్సిపాల్ ఆర్. హేమలత, ప్రోగ్రాం కన్వీనర్ బి. లీలా సుజాత కార్యక్రమంలో పాల్గొన్నారు.

## సమాజ ప్రయోజనమే స్టార్టప్ లక్ష్యం



**విజయవాడ పశ్చిమ, ఏప్రిల్ 10:(వార్తా ప్రభ ప్రతినిధి)** సరికొత్త ఆలోచనలు, ఆవిష్కరణలు చేయటంతో పాటు సమాజ ప్రయోజనమే స్టార్టప్ లకు ప్రధాన లక్ష్యం కావాలని, అటువంటి వ్యాపారమే అత్యంత వేగంగా ప్రజల ఆదరణ పొందుతుందని కోనేరు లక్ష్మయ్య ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సీఈఓ ఎసిఐసి వి.రమాకాంత్ అన్నారు. కెబిఎన్ కళాశాల ఐ హబ్ ఆధ్వర్యంలో శుక్రవారం 'స్టార్టప్ లీగల్ అండ్ ఎథికల్ స్టెప్స్' అంశంపై డిగ్రీ విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రమాకాంత్ మాట్లాడుతూ మంచి ఆలోచనతో పాటు ఆ ఆలోచనను చట్టబద్ధంగా, నైతికంగా ఆచరణలోకి తీసుకురావటం కూడా వ్యాపారంలో ప్రధానాంశంగా ఉంటుందన్నారు. ఎంచుకున్న వ్యాపారాన్ని సోల్ ప్రొప్రైటర్, పార్టనర్‌షిప్ లేదా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వంటి రూపాలలో నమోదు చేయటం, అవసరమైన లైసెన్స్ లు, పర్మిట్లు పొందటం, జిఎస్టీ నమోదు, ఇంటెలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్ తీసుకోవడం వంటి అంశాలను ఆయన ఉదాహరణ పూర్వకంగా వివరించారు. భాగస్వాములు, ఉద్యోగులు, కస్టమర్లతో స్పష్టమైన కాంట్రాక్టులు, ఒప్పందాలు ఉండటం కూడా వ్యాపార భద్రతకు చాలా అవసరమన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ వ్యాపారంలో నిజాయితీ, పారదర్శకత ఉండాలని, కస్టమర్లకు నాణ్యమైన ఉత్పత్తులు, సేవలు అందించాలన్నారు. సమాజానికి మేలు చేసే విధంగా వ్యాపారాన్ని నడపటాన్ని వ్యాపారస్తులు బాధ్యతగా తీసుకోవాలన్నారు. హిందూ హై స్కూల్స్ కమిటీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ ఉద్యోగులను గౌరవంతో చూసి, వారికి సరైన వేతనం, అనుకూలమైన పని వాతావరణం కల్పించాలన్నారు. ఐక్యుఎసి కో ఆర్డినేటర్ షమీమ్, ఐ హబ్ కన్వీనర్ జె. బాలాజీ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.





## రాష్ట్ర రాజకీయాల్లో జగన్ ఓ జోకర్

**టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్ర రాజకీయాలలో వైసిపి అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఓ జోకర్ అయ్యాడని టిడిపి రాష్ట్ర నాయకులు మాదిగాని గురునాథం ఎద్దేవా చేశారు. తెలుగువాడై ఉండి రాష్ట్ర రాజధాని పేరు మావిగాన్ అంటూ మాట్లాడి వైసిపి శ్రేణులతో కూడా జగన్ ఛీ అని పించుకుంటున్నాడని అన్నారు. గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంటు కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాదిగాని గురునాథం మాట్లాడుతూ..... జగన్ నోటి వెంట వచ్చిన మావిగాన్ ఒక 'మాయాగన్' అని అన్నారు. రాష్ట్రానికి మూడు రాజధానులు అంటూ జగన్ చేసిన చట్టం హైకోర్టులో వీగిపోయిందని, పార్లమెంట్‌లో కూడా ఆయనకు గతంలో మొట్టికాయలు పడ్డాయని ఈ సందర్భంగా గుర్తు చేశారు. 151 సీట్లు ప్రజలు ఇచ్చినా వైసిపి ప్రభుత్వ పాలనలో ఒక సరైన బిల్లు కూడా పెట్టలేని అసమర్థుడు జగన్ అని విమర్శించారు .అమరావతి రాజధానిగా ఉండటాన్ని రామోజీరావు నామకరణం చేశారని, అది ప్రస్తుతం చట్టబద్ధతతో గెజెట్‌లో కూడా నమోదైందని, దాన్ని మార్చడం జగన్ వల్ల కాదని స్పష్టం చేశారు . చంద్రబాబుపై అసూయతో రాజధానిని అతాకతలం చేసేందుకు జగన్ తన 'సైతాను సైన్యాన్ని' వాడుకుంటున్నారన్నారు. ప్రజల చేత నియంత అని పించుకుంటున్నారన్నారు. ఉత్తర కొరియా నియంత కిమ్ తరహాలో జగన్ వ్యవహరిస్తున్నారని, ప్రజాస్వామ్యంలో ఆయనకు ఇక స్థానం లేదని గురునాథం పేర్కొన్నారు . అమరావతి రాజధాని మహిళలపై వైసిపి ప్రభుత్వ పాలనలో 2000 కేసులు బనాయించి, వారి ఇళ్లపై డ్రోన్లు పంపించి వేధించిన దుర్మార్గుడు జగన్ అని, ఇప్పుడు మహిళల సంక్షేమం, గౌరవం గురించి మాట్లాడటం హాస్యాస్పదమని అన్నారు. రాజకీయంగా జగన్ పతనం మొదలైందని, ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు మానుకోకపోతే జనం తరిమి తరిమి కొట్టడం ఖాయమని హెచ్చరించారు .రాబోయే రోజుల్లో చట్టం తన పని తాను చేసుకుపోతుందని, చేసిన తప్పులకు జగన్ మోహన్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని స్పష్టం చేశారు. గత ఐదేళ్ల పాలనలో ఫోర్త్ ఎస్టేట్ అయిన మీడియా గొంతు నొక్కేందుకు జగన్ తీవ్ర ప్రయత్నాలు చేశారని మండిపడ్డారు . ఏబిఎన్ వంటి దమ్మున్న ఛానళ్లను టార్గెట్ చేస్తూ, కులాలను ఆపాదించి వేధించారని దుయ్యబట్టారు. ఇప్పుడు ఏబీఎన్ - ఆంధ్ర జ్యోతి పై అక్కసుతో దాడులకు పాల్పడుతున్నారన్నారు. మీడియాపైన, ప్రజలపై గతంలో చేసిన దాడుల వల్లే ప్రజలు మిమ్మల్ని 11 సీట్లకు పరిమితం చేశారని, ఇకముందు కూడా ఇదే ధోరణి కొనసాగిస్తే 2029 నాటికి జగన్ రెడ్డి 'జీరో రెడ్డి' కావడం ఖాయం" అని హెచ్చరించారు .టిడిపి సీనియర్ నాయకులు నరసింహ చౌదరి మాట్లాడుతూ....వైసిపి పార్టీ రాష్ట్రానికి పట్టిన ఛీడగా ఉందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిరంతరం పాటుపడుతుంటే రాష్ట్ర అభివృద్ధిని అడ్డుకోవడమే పనిగా జగన్‌మోహన్‌రెడ్డి, వైసిపి పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారన్నారు. ఇదే పరిస్థితి వైసిపి కొనసాగిస్తే రాష్ట్రంలో ఆ పార్టీ కనుమరుగు కావడం తథ్యం అన్నారు. టిడిపి జిల్లా నాయకులు డాక్టర్ విశ్వనాథం మాట్లాడుతూ..... ఏబీఎన్ వంటి మీడియా సంస్థల జోలికి వచ్చి జగన్ తన ఉనికిని కోల్పోయే పరిస్థితులను తెచ్చుకున్నాడని అన్నారు. ఎంతో నిబద్ధత గల జర్నలిస్టు ఏబీఎన్ రాధాకృష్ణ అని, ఆయనను జగన్ ఇబ్బంది పెట్టాలనుకుంటే ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. లిటిడిపి నాయకులు కె. జీవన్ మాట్లాడుతూ....రాజధాని అమరావతి విషయంలో వైసిపి చేస్తున్న దుష్ప్రచారాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా రాజధాని అమరావతి విషయంలో ఇప్పటికైనా వైసిపి నాయకులు తమ వైఖరి మార్చుకుని అమరావతికి జై కొడితే ప్రజలు హర్షిస్తారని, లేకుంటే రాష్ట్రం నుంచి తరిమి కొడతారన్నారు.

## నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు

**విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** నగరంలో విస్తృతంగా డీసిల్టింగ్ పనులు జరుగుతున్నాయని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. శుక్రవారం ఉదయం తన పర్యటనలో భాగంగా ఆటోనగర్, ప్రసాదంపాడు ప్రాంతాలన్నీ పర్యటించి డీసిల్టింగ్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో రోడ్డుపైన నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ముఖ్యంగా నిర్మల కాన్వెంట్ రోడ్డు, పిన్నమనేని పాలిటెక్నిక్ రోడ్డు వంటి పలు ప్రాంతాలలో చిన్నపాటి వర్షానికి రోడ్డుపైన నీరు నిల్వ ఉండకుండా, అక్కడ ఉన్న డ్రైన్లలో మురుగునీటి ప్రవాహానికి ఎటువంటి అంతరాయం లేకుండా ఉండేందుకు ఆ నీరు రైవస్ కాలువలో కలిసేంత వరకు, విజయవాడ నగరపాలక సంస్థ పరిధి కాకపోయినా, వర్షం పడినప్పుడు ఆ నీటి ప్రవాహం పరిధి దాటిన తర్వాత ఉన్న ఆటోనగర్, ప్రసాదంపాడు వైపు గల కాలువలలో అడ్డు ఉండటం వలన, వర్షపు నీరు తిరిగి నగర పరిధిలో ప్రవాహిస్తున్నందున సైడ్ డ్రైన్లు, మేజర్ ఔటఫాల్ డ్రైన్లలో కలిసేంతవరకు డీసిల్టింగ్ ప్రక్రియను పూర్తి చేస్తున్నామని అన్నారు. ఈ పర్యటనలో సూపరింటెండింగ్ ఇంజనీర్ వర్క్స్ చంద్రశేఖర్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సామ్రాజ్యం, అసిస్టెంట్ సిటీ ప్లానర్ పి మోహన్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.



## శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి సింహాద్రి అప్పన్న చందన మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని స్థానిక శ్రీనివాసమహల్ సెంటర్ వద్ద నిర్వహించిన శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి సింహాద్రి అప్పన్న చందన మహోత్సవ వేడుకలల్లో మాజీ మంత్రి , విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ:"సింహాద్రి అప్పన్న ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని, నగరం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఈ ప్రత్యేక పూజల్లో పాల్గొనడం జరిగింది. భక్తిశ్రద్ధలతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో శాంతిని, ఐక్యతను పెంపొందిస్తాయి" అని పేర్కొన్నారు.

నేడు ఆంధ్ర టు నవ్యాంధ్ర గ్రంథావిష్కరణ కార్యక్రమం

## పుస్తక రచయిత,సీనియర్ జర్నలిస్టు అన్నవరపు బ్రహ్మాయ్య



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10: (వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రముఖ రచయిత, సీనియర్ జర్నలిస్టు అన్నవరపు బ్రహ్మయ్య రచించిన ఆంధ్ర టు నవ్యాంధ్ర గ్రంథావిష్కరణ కార్యక్రమం శనివారం ఉదయం 10:30 గంటలకు గవర్నర్ పేట రాఘవయ్య పార్కు వద్ద ఉన్న బాలోత్సవ భవన్లో జరగనుంది. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వసంత నాగేశ్వరరావు, టిడిపి పోలిట్ బ్యూరో మెంబర్ తొండెపు దశరథ జనార్ధన రావు, మహా న్యూస్ చైర్మన్ ఎం. వంశీకృష్ణ, అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ చైర్మన్ ఆచార్య ఎస్. విజయభాస్కరరావు, నందిగామ లోని అపోలో కాకతీయ విద్యాసంస్థల చైర్మన్ కాపా రవీంద్రనాథ్, డిడి సప్తగిరి ప్రోగ్రాం హెడ్ ఏ.వి.కృష్ణమోహన్, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి . వి.పూర్ణచంద్, ఆంధ్రప్రదేశ్ జర్నలిస్ట్స్ ఫోరం గౌరవాధ్యక్షులు చెవుల కృష్ణాంజనేయులు, సీనియర్ పాత్రికేయులు సిహెచ్ వివి. సత్యనారాయణ, ప్రముఖ కవి కొమ్మవరపు విల్సన్ రావు, సీనియర్ పాత్రికేయులు గంటా విజయ్ కుమార్ తదితరులు పాల్గొంటున్నారు.

## దుర్గమ్మ ఆలయ ఈవో వీకే శీనా నాయక్ వివిధ విభాగాలను తనికీలు





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** దేవాదాయ కమిషనర్ వారి ఆదేశాల ప్రకారం రద్దీ సమయంలో భక్తులకు అందుబాటులో ఉంటే సమస్యలు తెలుస్తాయాన్న అభిప్రాయంతో అన్ని ప్రదేశాలను శుక్రవారం దుర్గమ్మ గుడి ఈ ఓ క్షుణ్ణంగా పరిశీలన చేశారు.దుర్గా స్నానఘాట్ నిత్యం పరిశుభ్రతతో ఉండేలా చర్యలు తీసుకోవాలని, రేవు అంచుల్లో పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు లేకుండా శుభ్రం చేయాలని ఆదేశించారు.దుర్గా ఘాట్ నుండి కేశ ఖండనశాల వైపు ఉన్న అండర్ పాస్ ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, కేశ ఖండనశాలలో మరుగుదొడ్లు, స్నానాల గదుల్లో అన్ని ఏర్పాట్లు సరిగ్గా ఉన్నాయా లేదా అనేది సిబ్బంది గమనించి, రిపేర్లు ఉంటే చేయించాలని ఆదేశించారు.ఘాట్ రోడ్ ఆరంభంలోని సురక్షిత వాటర్ ప్లాంట్ పరిశీలన చేశారు. అక్కడ నుండి కాలినడకన కొండపైకి చేరి, భక్తుల సౌకర్యార్థం ఘాట్ రోడ్ లో ఈ టాయిలెట్స్ సంఖ్య పెంచాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.బస్ షెల్టర్,ఓం టర్నింగ్ ఏరియాలో భక్తుల సౌకర్యార్థం అప్పటికప్పుడు కాయిర్ మ్యాట్ వేయించారు.ప్రధాన ఆలయం చుట్టూ వేస్తున్న చలువ పందిరి పరిశీలన చేసి ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో వెస్ట్ ఏ సీపీ శ్రీ దుర్గారావు, సిఐ శ్రీ గుణరామ్, ఇంజినీరింగ్ అధికారులు శ్రీ కోటేశ్వరరావు, రవీంద్ర, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## కొండపల్లి బొమ్మల ఉత్సవ్ కు స్థల పరిశీలన



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**కొండపల్లి ఖిల్లా రోడ్డు బొమ్మల కాలనీలో ఈనెల 18,19,20వ తేదీల్లో కొండపల్లి బొమ్మల ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కొండపల్లి మునిసిపాలిటీ కమిషనర్ బి శ్రీనివాస్, పురపాలక చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు పర్యాటక శాఖ అధికారులతో కలిసి బొమ్మల కాలనీ లో స్థలాన్ని శుక్రవారం నాడు పరిశీలించారు.ఈ సందర్భంగా పురపాలక చైర్మన్ మరియు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి చిట్టిబాబు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా కొండపల్లి బొమ్మలకు చాలా ప్రాముఖ్యత ఉంది.కొండపల్లి బొమ్మల ప్రాముఖ్యతను మరింతగా ప్రపంచ వ్యాప్తంగా చేరువ చేసే దిశగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీషా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.మూడు రోజుల పాటు జరుగుతాయి.అదే విధంగా సాయంత్రం సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు కూడా జరుగుతాయని తెలిపారు.ఈ కార్యక్రమం లో కొండపల్లి మునిసిపాలిటీ ఏఈ మౌస్మీ గనియా, పర్యాటక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# ఫ్రూట్స్ వ్యాపారి పై హత్యాయత్నం.

**పరిస్థితి విషమం విజయవాడకి తరలింపు.**



**మచిలీపట్నం ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మచిలీపట్నం చలరాస్తా సెంటర్లో దారుణం చోటు చేసుకుంది. ఫ్రూట్స్ వ్యాపారిపై స్నేహితుడు కత్తితో దాడి చేసి అమానుషంగా ప్రవర్తించడం స్థానికంగా కలకలం సృష్టించింది. సేకరించిన సమాచారం ప్రకారం చల్లపల్లి పవన్ బాబు, వక్కలగడ్డ సాయి అనే ఇద్దరు స్నేహితులు. ఈ ఇద్దరి మధ్య పాత గొడవలు నేపథ్యంలో శుక్రవారం చలరాస్తా సెంటర్ వద్ద చిన్నపాటి ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణ హత్యాయత్నానికి దారితీసింది. సాయి అనే యువకుడు విజయవాడ నుంచి పూటుగా మద్యం సేవించి తనతో తెచ్చుకున్న కత్తితో పవన్ బాబు పై దాడి చేశాడు అని స్థానికులు తెలిపారు. ఈ దాడిలో ముఖం నుండి పొట్ట వరకు కత్తి చీరుకొని బాబు తీవ్రంగా గాయపడ్డాడు. గాయపడిన బాబును స్నేహితులు హుటాహుటిన మచిలీపట్నం సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందిస్తున్న వైద్యులు పరిస్థితి విషమించడంతో విజయవాడకు రిఫరల్ చేశారు. ఘటనలో అడ్డొచ్చిన మరికొంత మందిపై కూడా సాయి కత్తితో దాడి చేసినట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, ఇరువురి మధ్య ఘర్షణ లో నిందితుడు సాయి చేతికి కూడా గాయాలయ్యాయి. చికిత్స పొందుతున్న సాయి మాత్రం ముందుగా తనపై బాబు దాడి కి పాల్పడ్డారని ఆరోపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. నిందితుడను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై ఇనకుదురు పేట పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## పులి వాహనంపై స్వామివారి దర్శనం



**సంగం ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)** సంగం పట్టణంలోని శ్రీ కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా ఆలయం ప్రాంగణమంతా భక్తులతో కిక్కిరిసిపోయింది. బ్రహ్మోత్సవాలలో భాగంగా శుక్రవారం పులి వాహనంపై శ్రీ కామాక్షీదేవి సమేత సంగమేశ్వర స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణలతో వెలుగొందిన స్వామివారిని దర్శించేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తి వాతావరణం నెలకొంది. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీర్వాదాలు పొందారు. ఆలయ అధికారులు బ్రహ్మోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహిస్తూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారు. ప్రతిరోజూ వాహన సేవలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించబడు తున్నాయి.

## కలెక్టర్ రక్తదానం అందరికీ స్ఫూర్తిదాయకం...



**మచిలీపట్నం ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**జిల్లాలోని పౌరులందరూ రక్తదానం చేసి ఆపదలో ఉన్న వారి ప్రాణాలను కాపాడాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. జాతీయ సర్వే దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉదయం నగరంలోని కలెక్టర్ వారి కార్యాలయ ప్రాంగణంలో సర్వే భూ రికార్డుల సర్వే కార్యాలయ ముంగిట జిల్లా కలెక్టర్ డి కె బాలాజీ సంయుక్త కలెక్టర్ ఎం నవీన్ తో కలసి రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం వారు రక్తదానం చేసి అందరికీ స్ఫూర్తిదాయకంగా నిలిచారు. పలువురు సర్వే సిబ్బంది కూడా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ జాతీయ సర్వే దినోత్సవం పురస్కరించుకొని రక్తదాన శిబిరం ఏర్పాటు చేసుకుని సర్వేయర్లందరూ రక్తదానంలో పాల్గొనడం గొప్ప విషయం అన్నారు. రక్తదానం చేయడం చాలా ముఖ్యమైన మంచి కార్యక్రమమన్నారు. ఆసుపత్రులలో పరిశీలిస్తే ప్రతిరోజు ఏదో రకమైన ప్రమాదాలతో వచ్చే రోగులకు గాని , వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో రక్తహీనత ఉండే రోగులకు గాని రక్తం చాలా అవసరం ఉంటుందన్నారు. సర్వే శాఖ వారు ఇటువంటి రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. జిల్లాలోని పౌరులందరూ రక్తదానం చేసేందుకు ముందుకు వచ్చి ఆపదలో ఉన్న వారిని కాపాడాలన్నారు. ఇతరత్రా ఖాళీగా ఉన్న సమయాల్లో కూడా నగరంలోని ఐ ఆర్ సి ఎస్ వద్ద వీలైనంత ఎక్కువగా రక్తదానం చేయాలని చాలామంది ప్రాణాల్ని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే రికార్డుల శాఖ ఏడి లక్ష్మణరావు గుడివాడ ఆర్డిఓ జి బాలసుబ్రమణ్యం, ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ సిరివి శెట్టి భాస్కర్, డాక్టర్ డి హనుమంతయ్య, కోశాధికారి కుమార్, జిల్లా సమన్వయకర్త హరికృష్ణ, పలువురు సర్వేయర్లు, సర్వే శాఖ సిబ్బంది, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండండి

**సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ అశోక్ కుమార్**



**సంగం ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)** వేసవి తీవ్రత రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డాక్టర్ అశోక్ కుమార్ ప్రజలకు అప్రమత్తంగా ఉండాలని మాట్లాడారు. శుక్రవారం స్థానిక పీహెచ్ సీలో మీడియాతో మాట్లాడిన ఆయన అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని స్పష్టం చేశారు. ముఖ్యంగా ఉదయం 11 గంటల లోపు అవసరమైన పనులు ముగించుకోవాలని సాయంత్రం 5 గంటల తర్వాత మాత్రమే బయటకు వెళ్లడం మంచిదని సూచించారు. వృద్ధులు చిన్నపిల్లలు గర్భిణీలు ఎండల ప్రభావానికి ఎక్కువగా గురయ్యే అవకాశం ఉన్నందున ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. శరీరంలో నీటి శాతం తగ్గకుండా తరచుగా ద్రవాలు తీసుకోవాలని నేరుగా ఎండలో ఎక్కువసేపు ఉండకూడదని సూచించారు. అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని, గ్రామాల్లో వైద్య సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. ప్రజలు జాగ్రత్తగా ఉంటేనే ఎండల ప్రభావాన్ని తగ్గించుకోవచ్చని డాక్టర్ అశోక్ కుమార్ పేర్కొన్నారు.

# గిరిజన వధువుకు 10,116 రూ. పెళ్లి కానుక

**సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ సేవలు ప్రశంసనీయం**



**సంగం ఏప్రిల్ 10 (వార్తాప్రభ ప్రతినిధి)** గిరిజన ఆడపడుచులకు అండగా నిలుస్తూ సాంబశివ చారిటబుల్ ట్రస్ట్ మరోసారి తన సేవా భావాన్ని చాటుకుంది. ట్రస్ట్ చైర్మన్ కంచి పరమేశ్వర రెడ్డి వీర్లగుడిపాడు ఎస్టీ కాలనీకి చెందిన గిరిజన వధువు సోమ మహి వివాహానికి ఆర్థిక సహాయం అందజేశారు. వివరాల్లోకి వెళ్తే, 'గిరిజన ఆడపడుచులకు పెళ్లి కానుక' పథకం కింద రూ.10,116 నగదు చెక్కుతో పాటు వధూవరులకు పట్టు వస్త్రాలను అందజేశారు. పరమేశ్వర రెడ్డి రాకతో కాలనీలో పండుగ వాతావరణం నెలకొంది. స్థానికులు పూలు చల్లి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో అవగాహన పెంచి బాల్య వివాహాలను అరికట్టడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. నిజమైన పేద కుటుంబాలకు సహాయం అందించడం తమ ట్రస్ట్ లక్ష్యమని చెప్పారు. విద్య ప్రాముఖ్యతపై దృష్టి సారించిన ఆయన ప్రతి కుటుంబంలో కనీసం ఒక్కరు ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధిస్తే అది మిగతా పిల్లలకు ఆదర్శంగా మారుతుందని పేర్కొన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను తప్పనిసరిగా పాఠశాలకు పంపాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ ట్రస్ట్ అందిస్తున్న వివాహ కానుకలు గిరిజన కుటుంబాల్లో ఆనందాన్ని నింపుతున్నాయని కొనియాడారు. అదేవిధంగా ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అన్నప్రసాద కార్యక్రమాలు నిర్వహిస్తూ పరమేశ్వర రెడ్డి సేవా కార్యక్రమాలను విస్తరించడం అభినందనీయమన్నారు. ఇదిలా ఉండగా వధువు సోమ మహి పరమేశ్వర రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తూ తన వివాహానికి తండ్రిలా అండగా నిలిచి ఆశీర్వదించడం తనకు మరువలేని అనుభూతిగా నిలిచిందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ సభ్యులు రాంపల్లి ప్రసాద్ రెడ్డి కట్టా మహేశ్వర్ రెడ్డి గోవిందరెడ్డి కొల్లి వెంకటేశ్వర్లు మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

# ముస్లిం సమాధులు తవ్వి విద్వేషాలు రెచ్చగొడుతున్న వీటీపీఎస్ అధికారులు

- కోర్టు ఆదేశాలు సైతం ధిక్కరిస్తున్నారు
- వీటిపిఎస్ అధికారుల తీరుతో ప్రభుత్వానికి చెడ్డ పేరు
- కలెక్టర్ ఫిర్యాదు చేసిన అల్తాఫ్ బాబా

**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**ముస్లిం సమాధులు తవ్వి విద్వేషాలు రెచ్చగొడుతున్న డాక్టర్ ఎన్ టి టి పి ఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మి శా ను కోరారు రాష్ట్ర అహలె సున్నతుల్ జమాత్ కన్వీనర్ అల్తాఫ్ బాబా. హైకోర్టు 2702 / 2026 ఆర్డర్ ప్రకారం 428 ముస్లిం బరియల్ గ్రౌండ్ గా ఉందని అక్కడ ఎలాంటి తవ్వకాలు జరపరాదని ఆర్డర్ ఇచ్చిన... హైకోర్టు ఆదేశాలు ధిక్కరిస్తూ తవ్వకాలు జరపడం దారుణం అన్నారు. జెసిపిలు , ఒక ప్రోక్లైన్లతో సమాధులు తవ్వి ఇష్ట రాజ్యాంగ అంశం చేయడం తీవ్ర అభ్యంతరకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో చరిత్ర కలిగిన కొండపల్లిలో వీటిపిఎస్ అధికారులు విధ్వంసం సృష్టిస్తున్నారని, పురాతన రాళ్లను తొలగించడం తగదని అన్నారు. వీటిపిఎస్ పై వెంటనే కోర్టు ధిక్కారం కేసు వేస్తామని, కలెక్టర్ స్పందించి, మనోభావాలు కాపాడే విధంగా కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఒకపక్క రాష్ట్ర ముఖ్యమంత్రి సమస్యలు లేకుండా ప్రజలతో మమేకమై ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని చెప్తుంటే... మరోపక్క అందుకు విరుద్ధంగా ప్రభుత్వానికి చెడ్డ పేరు తెచ్చేలాగా ముస్లిం మైనార్టీలను రెచ్చగొడుతున్నారు వీటీపీఎస్ అధికారులు. వెంటనే తవ్వకాలు ఆపకపోతే ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్, గవర్నర్ నజీర్ అహ్మద్ కు ఈ సంఘటనపై ఫిర్యాదు చేస్తామని... న్యాయం జరిగే వరకు పోరాడుతామని హెచ్చరించారు.



# మీ ఇంట్లో దోమలు ఉండకూడదు అంటే ప్రతి ఫ్రైడే డ్రైడే పాటించాల్సిందే

**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నగరంలో పెరుగుతున్న దోమల సమస్యను నియంత్రించేందుకు ప్రతి ఇంట్లో ఫ్రైడేను, డ్రై డే గా పాటించాలని విజయవాడ నగరపాలక సంస్థ బయాలజిస్ట్ వి.కామేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఉదయం స్టేట్ బ్యాంక్ కాలనీ లో ఫ్రైడే డ్రై డే కార్యక్రమం నిర్వహించి ఆ ప్రాంతంలో గల ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బయాలజిస్ట్ వి. కామేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో దోమల సమస్యలను నియంత్రించేందుకు విజయవాడ నగరపాలక సంస్థ విస్తృతమైన చర్యలు తీసుకుంటుందని అందులో భాగంగా నగరంలో ఉన్న కాలువల్లో పూడికలు తొలగించి నీటి ప్రవాహం ఎక్కడ ఆగకుండా చూసుకుంటున్నారని, ట్రాక్టర్ మెషిన్ తో బోట్ల సహాయంతో సిబ్బంది కాలువల్లో పర్యటించి గుర్రపుడెక్కలను, వ్యర్థాలను తొలగిస్తున్నారని, సిబ్బంది వెళ్లలేని చోట డ్రోన్ ని పంపించి ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే చేసి దోమల లార్వా ఉత్పన్నమవుకుండా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. మరోవైపు నగర పరిధిలో ఫాగింగ్, స్ప్రేయింగ్, మరి కొన్నిచోట్ల దోమల లార్వాని తినే గంబోజియా చాపలను విడుదల చేస్తూ నగరంలో దోమల నియంత్రణకు విస్తృతమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఒకవైపు విజయవాడ నగరపాలక సంస్థ చర్యలు తీసుకుంటున్నప్పటికీ ప్రతి ఇంట్లో దోమలు ఉత్పన్నం అవ్వకుండా డ్రైడే పాటించాలని అది ప్రతి శుక్రవారం పాటిస్తే ప్రతి ఇంట్లో దోమల సమస్యలు ఉండవని అన్నారు. ప్రతి శుక్రవారం తమ ఇంట్లో మరియు ఇంటి చుట్టు పరిసరాలలో ఎక్కడ నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని, ముఖ్యంగా తొట్లు, వాడుక లేని బకెట్లు, మగ్గులు, డ్రమ్ములు, పూల కుండీలు, అలా ఏ వస్తువు అయినా వాడుకంలో లేనివి అందులో నీటి నిల్వ ఉండే అవకాశం ఉన్నవి, ప్రతి శుక్రవారం వాటిని గమనించి ఆ నిల్వ ఉన్న నీరుని పారవేస్తే ఇంట్లో దోమల సమస్య తగ్గుతుందని అన్నారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో ఉన్న ప్రజలకు వారి ఇంటి వద్దకు వెళ్లి నీటి నిల్వలు ఎక్కువగా ఉండే అవకాశం ఎక్కడ ఉన్నాయని చూపించి, వాటిని పారేస్తే అందులో లార్వా చచ్చిపోతుందని వారికి అవగాహన కల్పించి ప్రతి శుక్రవారం దీన్ని పాటిస్తే దోమలను శాశ్వతంగా నియంత్రించవచ్చని వారికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బయాలజిస్ట్ తో పాటు సానిటరీ ఇన్స్పెక్టర్లు మరియు మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



# తెలుగుదేశం పార్టీని తిరుగులేని శక్తిగా మారుద్దాం

- మావిగన్ అంటున్న లెవెన్ రెడ్డి ఒక సైకో
- మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్
- గుంటుపల్లిలో తెదేపా మండల శాఖ సమావేశం.




**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేసి, తిరుగులేని శక్తిగా మారుద్దామని, ఇందుకోసం ఐకమత్యంగా శక్తివంచన లేకుండా కృషి చేద్దామని మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ పిలుపునిచ్చారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి లో శుక్రవారం రాత్రి నిర్వహించిన తెలుగుదేశం పార్టీ ఇబ్రహీంపట్నం మండల శాఖ విస్తృతస్థాయి సమావేశంలో మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ పాల్గొన్నారు. తొలుత అన్న ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సమావేశంలో పాల్గొన్న మైలవరం శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రాజధానికి మద్దతు ఇవ్వని పార్టీ వైసీపీ అన్నారు. ఇప్పటికే రాజధాని విషయంలో రెండు పర్యాయాలు మోసపోయమన్నారు. లెవెన్ రెడ్డి ఒక సైకో అని మావిగన్ అంటూ వింత పదాలతో వికృత చేష్టలకు దిగి విష ప్రచారం చేస్తున్నాడన్నారు. దీన్ని మనమంతా తిప్పి కొట్టాలని తెదేపా శ్రేణులకు పిలుపునిచ్చారు. అమరావతి రాజధాని గురించి గ్రామాల్లో వైసీపీ నేతలను నిలదీయాలన్నారు. సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు అనే నినాదంతో తెలుగుదేశం పార్టీ ఆవిర్భవించిందన్నారు. విభజింపబడిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తుకు తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపల్లిలో 8వ పోషణ పక్వాడ కార్యక్రమం

**పోషక విలువలు కలిగిన పదార్థాలు తీసుకోవాలి... చేజర్ల సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ**



**చేజర్ల ఏప్రిల్ 10 (వార్తాప్రభ)** చేజర్ల మండలంలోని గొల్లపల్లి ఎస్టీ కాలనీ నందు శుక్రవారం 8వ పోషణ పక్వాడా కార్యక్రమాన్ని ఐసిడిఎస్ ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలోని చేజర్ల సెక్టార్ వారు నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ చేజర్ల మండల సెక్టార్ సూపర్వైజర్ ఎం.పద్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి పిల్లల తల్లులందరిని సమావేశపరిచారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ మాట్లాడుతూ పోషకాహారం పట్ల ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. ఎక్కువ పోషక విలువలు ఉన్నటువంటి మునగాకు ఆకుకూరలు చిరుధాన్యాలు పాలు గుడ్లు వంటి మంచి పోషక విలువలు ఉన్నటువంటి ఆహారాలను గర్భవతులు మరియు బాలింతలు పిల్లలు తీసుకోవాలని సూచించారు. ఈ పోషకాలు కలిగిన పదార్థాలపై కుటుంబ సభ్యులందరికీ తెలియజేశారు అలాగే ప్లాస్టిక్ కవర్లలో ఆహార పదార్థాలను నిల్వ ఉంచకూడదన్నారు. ప్లాస్టిక్ డబ్బాల్లో ఆహారాలను బయట నుండి తీసుకువచ్చి తినకూడదని అలాగే పిల్లలకు ఇవ్వకూడదని పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ఇంట్లోనే తయారుచేసి పిల్లలు మరియు తల్లులు అందరూ సంపూర్ణ ఆహారాన్ని తీసుకునే విధంగా ఉండాలని కుటుంబంలో ఉండే సభ్యులందరికీ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం నందు అంగన్వాడీ టీచర్లు ఎం పద్మ భూలోకం విజయ కుమారి పోలమ్మ మరియు అంగనవాడీ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## మహిమలూరులో మనబడి - జ్ఞానబాట




**ఆత్మకూరు ఏప్రిల్ 10 (వార్తాప్రభ)** మహిమలూరులో గ్రామంలో శుక్రవారం మనబడి - జ్ఞానబాట ర్యాలీని పి ఎం శ్రీ మండల ప్రజా పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల మహిమలూరు మెయిన్ నందు మహిమలూరు గ్రామంలో నిర్వహించి 2026-27 విద్యా సంవత్సరమునకు పిల్లల ప్రవేశాలను ఆహ్వానించడమైనది. పై ర్యాలీలో మండల విద్యాశాఖ అధికారి కొల్లు చలపతి మరియు ప్రధానోపాధ్యాయులు షేక్ ఇస్మాయిల్ ఉపాధ్యాయులు రమేష్ బాబు రేవతి వెంకటేశ్వర్లు ఖాజా రసూల్ సబిహ మరియు పాఠశాల పిల్లలు పాల్గొనడం జరిగినది.

## నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న వేమూరు కావేరి ట్రావెల్స్ బస్సు సీజ్

**హైదరాబాద్-ఏఎస్ పేట మార్గంలో తనిఖీలు... బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలింపు**



**ఆత్మకూరు ఏప్రిల్ 10 (వార్తాప్రభ)** నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న వేమూరు కావేరి ట్రావెల్స్ బస్సును ఆత్మకూరు ఎంవీఐ ఎం.రాములు ఆధ్వర్యంలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల బృందం సీజ్ చేసింది. హైదరాబాద్ నుండి ఏఎస్ పేటకు వస్తున్న సమయంలో అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించి బస్సును అదుపులోకి తీసుకున్నారు. అవసరమైన అనుమతులు మరియు నిబంధనలు పాటించకపోవడంతో బస్సుపై చర్యలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు. సీజ్ చేసిన వేమూరు కావేరి ట్రావెల్స్ బస్సును ఏఎస్ పేట పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్స్పెక్టర్ రాంబాబు గోపి నాయక్ సంధ్యతో పాటు ఆత్మకూరు ఎంవీఐ ఎం.రాములు పాల్గొన్నారు.

## చేజర్ల లో మనబడి - జ్ఞానబాట ర్యాలీ నిర్వహణ



**చేజర్ల ఏప్రిల్ 10 (వార్తాప్రభ)** చేజర్ల లో మనబడి- జ్ఞానబాట కార్యక్రమంలో భాగంగా చేజర్ల మండల విద్యాశాఖ అధికారులు ఎన్రోల్మెంట్ ర్యాలీని శుక్రవారం ప్రారంభించడం జరిగింది. ప్రభుత్వ పాఠశాలలో అనేక సౌకర్యాలు కల్పించబడుతున్నాయి ఉచిత యూనిఫామ్ పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ మరియు షూలు అందజేయడం జరుగుతుంది రుచికరమైనటువంటి పోషకాలతో కూడిన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుంది. కావున ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ యొక్క పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి వారి భవిష్యత్తును బంగారు బాటలో మళ్లించమని విద్యార్థుల తల్లిదండ్రులకు ర్యాలీ ద్వారా అవగాహన కల్పించారు. మండలంలోని అన్ని ప్రాథమిక మరియు హైస్కూల్లో పాఠశాలల యందు ర్యాలీని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులుతో పాటు అన్ని పాఠశాలల ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## రేపు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గన్నవరం, ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యుత్ లైన్లు మరమ్మతు నిమిత్తం గన్నవరం సెక్షన్ పరిధిలో 33/11కేవీ గన్నవరం సబ్ స్టేషన్ మెయింటినెన్స్ వర్క్ నిమిత్తం సరఫరా నిలిపివేయబడును. రేపు ఏప్రిల్ 11 న, శనివారం ఉదయం 08:00 గంటల నుంచి 11:00గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీ సి పి డి సి ఎల్ గుణదల కార్యనిర్వాహక ఇంజనీర్ పి.హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ ఉండని ప్రాంతాలు గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్న అవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్పోర్ట్ సిటీ, స్లేట్ స్కూల్, గొల్లనపల్లి, బిబి గూడెం, ప్రాంతాలలో సరఫరా నిలిపి వేయబడును కావున గృహ వినియోదారులు, వ్యవసాయ వినియోగదారులు, వ్యాపార వినియోగదారులు,పరిశ్రమ వినియోగదారులు అందరూ సహకరించగలరని వారు కోరారు.

## ఆదివారం ఉచిత వైద్య శిబిరం.

**కూకట్ పల్లి,ఏప్రిల్ 10(వార్తాప్రభ):**మెడికోవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో కూకట్ పల్లి వివేకానంద కాలనీలోని సీనియర్ సిటిజన్ పార్కు నందు ఆదివారం ఫ్రీ హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు భారతీయ జనతా పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులు భాస్కర్ రెడ్డి శుక్రవారం ఓ ప్రకటన తెలిపారు. మాల మూత్ర పరీక్షలు,రక్త పరీక్షలు, ఈసీజీ, డెంటల్,ఐ చెకప్ వంటి అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులచే ఈ పరీక్షలు కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు ఉదయం 5:30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ వైద్య శిబిరం కొనసాగుతున్నట్లు తెలిపారు. అవసరమైన వారందరూ తప్పకుండా ఈ వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

## హైదరాబాద్ నుండి రాజమండ్రి కి ఫ్లై-91 నూతన విమాన సర్వీస్ ప్రారంభం

### మొదటి ప్రయాణికుడిగా జిల్లా టిడిపి అధ్యక్షులు జ్యోతుల నవీన్ ప్రయాణం



**కాకినాడ ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఫ్లై-91 విమాన సర్వీసు హైదరాబాద్ నుండి రాజమండ్రి మధ్య శుక్రవారం నుండి మొదలైంది. తొలి ప్రయాణికుడిగా కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు జ్యోతుల నవీన్ కుమార్ హైదరాబాద్ నుండి రాజమండ్రి విమానాశ్రయానికి ప్రయాణించారు. మధురపూడి విమానాశ్రయం డైరెక్టర్ కె .ప్రీతా, ఫ్లై -91 రాజమండ్రి స్టేషన్ మేనేజర్ నవీన్ కు స్వాగతం పలకడం జరిగింది. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ గోదావరి జిల్లాల విమాన ప్రయాణికులకు హైదరాబాద్ వెళ్లడానికి ఫ్లై 91 విమాన సర్వీసులు ప్రారంభించడంతో హైదరాబాద్ ప్రయాణం ఇంకా సులభమైందని నవీన్ అన్నారు.ఈ విమాన సర్వీసు ఫ్లై-91 సంస్థ తన సర్వీసులను రాజమండ్రి, విజయవాడ విమానాశ్రయాల నుండి హైదరాబాద్‌కు ప్రారంభిస్తోంది. అని నవీన్ తెలియ చేశారు.

## నూజివీడు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో డీఐజీ ఆకస్మిక తనిఖీ



**నూజివీడు, ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఏలూరు జిల్లా నూజివీడులోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ శాఖ డీఐజీ ఎన్. మాధవి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించిన ఆమె, సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ఏలూరు జిల్లా పరిధిలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వరుస తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు.ఆదాయ లక్ష్యాల సాధనపై దృష్టి పెట్టామన్నారు. గత ఏడాది నూజివీడు కార్యాలయానికి రూ. 68 కోట్ల ఆదాయ లక్ష్యాన్ని నిర్దేశించగా, కేవలం 78 శాతం మాత్రమే పూర్తి చేయడం జరిగిందని డీఐజీ తెలిపారు. ఈ ఏడాది ఆదాయాన్ని మరింత పెంచే దిశగా అడుగులు వేస్తున్నామని, ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి రూ. 79 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించినట్లు ఆమె పేర్కొన్నారు. అన్ని మార్గాల్లో ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.ప్రైవేటు వ్యక్తుల జోక్యంపై హెచ్చరికలు జారీ చేశారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనధికారికంగా అవుట్ సోర్సింగ్, ప్రైవేటు వ్యక్తులతో పనులు చేయిస్తున్నారనే అంశంపై డీఐజీ స్పందించారు. ఈ విషయం ఇప్పుడే తన దృష్టికి వచ్చిందని, సిబ్బంది కొరత ఉన్న మాట వాస్తవమేనని, దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామని చెప్పారు. అయితే, ప్రైవేటు వ్యక్తులతో కార్యాలయ పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధమని, దీనిపై ఫిర్యాదులు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

**నూతన భవన నిర్మాణంపై హామీ** ప్రస్తుతం కార్యాలయం ఉన్న భవనంలో వసతులు సరిగ్గా లేకపోవడంతో రిజిస్ట్రేషన్ల కోసం వచ్చేవారు ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు డీఐజీ దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై ఆమె సానుకూలంగా స్పందిస్తూ.. నూతన కార్యాలయ భవన నిర్మాణ అవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## పేద విద్యార్థినికి ఎంసెట్ కోచింగ్ ఫీజు వితరణ

### మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉదారత



**నూజివీడు :ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**నూజివీడు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివిన ప్రతిభావంతురాలైన ఒక పేద విద్యార్థినికి ఎంసెట్ కోచింగ్ నిమిత్తం ఆర్థిక సహాయం అందించారు. వివరాల్లోకి వెళితే ఒంగోలుకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ చేబ్రోలు మోహన కృష్ణ అందించిన వితరణతో ఈ విద్యార్థిని ఎంసెట్ కోచింగ్ ఫీజు చెల్లించడం జరిగింది. అలాగే కెనడాకు చెందిన మధురిత సౌజన్యంతో సదరు విద్యార్థినికి ఎంసెట్ మెటీరియల్ అందజేశారు.ఈ సందర్భంగా సంస్థ చైర్మన్ పి. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. మంచి దృక్పథం, ప్రతిభ కలిగిన విద్యార్థులకు అండగా నిలవడం సంతోషకరమన్నారు. విద్యార్థిని ఉన్నత చదువులకు సహకరించిన దాతలు చేబ్రోలు మోహన కృష్ణ, మధురితలకు ధన్యవాదాలు తెలియజేశారు.

# ప్రమాదాల నివారణకు పటిష్ట చర్యలు...

● నేషనల్ హైవే 65 పై బ్లాక్ స్పాట్లు గుర్తింపు ● ప్రమాదాల నివారణకు త్వరలో మరిన్ని కీలక నిర్ణయాలు ● కలెక్టర్ లక్ష్మీ శ, కమిషనర్ రాజశేఖర్ బాబు ● ఇబ్రహీంపట్నం రోడ్డు ప్రమాద ప్రాంతాలను పరిశీలించిన జిల్లా అధికారులు








**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10(వార్తా ప్రభ ప్రతినిధి):**ఇబ్రహీంపట్నం లో నేషనల్ హైవే 65 పై నిత్యం ప్రమాదం జరుగుతున్న పలు బ్లాక్ స్పాట్లను గుర్తించామని, త్వరలో రోడ్డు ప్రమాదాల నివారణకు కీలక నిర్ణయాలు తీసుకొని ఉన్నామని తెలిపారు జిల్లా కలెక్టర్ లక్ష్మీ శ, కమిషనర్ రాజశేఖర్ బాబు. శుక్రవారం నాడు జిల్లా వివిధ శాఖల ఎన్టీఆర్ జిల్లా ట్రాఫిక్ డీసీపీ షరీన్ బేగం ఆధ్వర్యంలో అధికారులతో కలిసి రోడ్డు భద్రత కార్యక్రమంలో భాగంగా బస్సు యాత్ర నిర్వహించారు. కేతనకొండ, మూలపాడు, జూపూడి, ఇబ్రహీంపట్నం, తుమ్మలపాలెం, గుంటుపల్లి గ్రామాల వద్ద ప్రమాద స్థలాలను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా డివైడర్ల వద్ద రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలు జరుగుతున్నట్లు గుర్తించారు. అందుకు అతివేగమే కారణమని నిర్ధారణకు వచ్చారు. ఇబ్రహీంపట్నం రింగ్ సెంటర్లో ట్రాఫిక్ రద్దీకి హైదరాబాద్ వైపు వెళ్లె రహదారి ఇరుకుగా ఉండటం గమనించి, అక్కడి నుండి చిరు వ్యాపారస్తులను తరలించాలని, డివైడర్ను కుదించి రహదారి వెడల్పు పెంచాలని సూచించారు.ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ.. రోడ్డు ప్రమాదాల నివారణకు కొన్ని ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటున్నామని, ప్రజలంతా సహకరించాలని కోరారు. పోలీస్ కమిషనర్ రాజశేఖర్ బాబు మాట్లాడుతూ.. రోడ్డు భద్రతా నిబంధనల పట్ల ప్రజలందరూ అవగాహన కలిగి ఉండాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని విజ్ఞప్తి చేశారు.

## తండ్రిని మించిన తనయురాలు నరేడ్ల కీర్తి రెడ్డి

**విస్సన్నపేట ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో నాడు ఎస్ఐగా సేవలందించవలసిన నరేడ్ల నర్సిరెడ్డి లా అండ్ ఆర్డర్ నియంత్రణ కన్న ప్రపంచానికి మేధావులను అందించే లక్ష్యంగా వికాస్ విద్యా సంస్థల తొలి అడుగు 1996 సంవత్సరంలో వేయటం జరిగింది. ఆనాటి నుండి ఈనాటి వరకు కేజీ నుండి పీజీ వరకు ఇంజనీరింగ్ ఫార్మసీ బీఈడీ పాలిటెక్నిక్ తదితర కోర్సులను తీసుకురావడంతో పాటు ఏలూరు జిల్లా నూజివీడు చాట్రాయి ఎన్టీఆర్ జిల్లాలో నున్న ఇంజనీరింగ్ రెడ్డిగూడెం తదితర మండలాలలో విద్యా సంవత్సరం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రపంచంలో అన్ని దేశాలలో వికాస్ విద్యార్థులు ఉన్నత స్థానాలలో సేవలు అందించడం జరుగుతుంది. నర్సిరెడ్డి కుమార్తె వికాస్ కాలేజీ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గా కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ ఇండియన్ ఉమెన్ నెట్వర్క్ ఆంధ్రప్రదేశ్ వార్షిక సమావేశంలో విద్యారంగంలో విశిష్ట మహిళ నాయకురాలుగా సత్కారాలు అందుకోవటం పట్ల సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు దక్షిణ భారతదేశం నలుమూలల నుండి 120 కి పైగా వ్యాపార ప్రముఖులు హాజరైన ఆ కార్యక్రమంలో ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించడం వికాస్ విద్యా సంస్థలకే గర్వకారణం అని పలువురు తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆమె తన ప్రసంగంలో పరిశ్రమలు విద్యాసంస్థల మధ్య బలమైన అనుసంధానం తో పాటు




లక్షపథమైన మెంటార్ షిప్ అవసరాన్ని ప్రాముఖ్యతతో వివరించారు. ఉద్యోగ రంగానికి సిద్ధంగా ఉన్న నైపుణ్యవంతులైన యువతను తీర్చిదిద్దటంలో ఈ అంశాలు కీలకమని ఆమె అభిప్రాయపడ్డారు. అదేవిధంగా తమ సంస్థలో నందు చదువుకునే విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఊహాత్మక కార్యక్రమాలు ప్రయోగాత్మక సవాళ్ళ ద్వారా వారి నైపుణ్యాలను అభివృద్ధి చేసేందుకు నిరంతరం పథక రచన చేయడం జరుగుతుందన్నారు. ఒక విద్యార్థి వికాస్ ఇంజనీరింగ్ లో అడుగుపెడితే మంచి కంపెనీలో ప్లేస్మెంట్ పొంది వారి జీవితానికి బంగారు బాటలు వేసుకోవాలనే లక్ష్యాలను సాధించుకునేందుకు తాము అహర్నిశలు పనిచేస్తామని ఆమె చెప్పారు.

## నైవేద్యం అల్పాహారం ప్రారంభించిన చిన్న జీయర్ స్వామీజీ

### మే1 నుండి అందుబాటులో నైవేద్యం

**కాకినాడ రూరల్, ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** కాకినాడ రూరల్ రమణయ్య పేటలో నూతనంగా ఏర్పాటు చేసిన నైవేద్యం అల్పాహారం మహోత్సవం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంలో ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి పద్మభూషణ్ శ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామిజీ విచ్చేసి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వచనాలు అందించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగాకాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ,మాజీ మంత్రి కురసాల కన్నబాబు ,మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి సత్తిబాబు హాజరై నిర్వాహకులను అభినందించారు.స్వామిజీ ఆశీర్వాదాలతో ప్రారంభమైన ఈ కార్యక్రమంలోనిర్వాహకులు రాజశేఖర్ రెడ్డి, డా. రామకృష్ణ, డా.కిషోర్అతిథులను సాదరంగా ఆహ్వానించి సత్కరించారు.ఈ సందర్భంగా డాక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఏర్పాటు చేసిన ఈ ఫలహారశాలకు విచ్చేసిన అతిథులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే రుచికి ,శుచికి ఏమాత్రం రాజీ పడకుండా అలాగే ఆరోగ్యవంతమైన వంటకాలతో



ఆహార ప్రియులకు ఆహ్వానం పలుకుతుందని,మే1వ తేదీ నుండి ఇక్కడ నైవేద్యం అల్పాహారం లభిస్తుందని ఆయన తెలిపారు .ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, భక్తులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సిబ్బంది అర్జీలు పరిష్కారానికి కృషి : జిల్లా ఎస్పీ బిందు మాధవ్



**కాకినాడ :ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పోలీసు సిబ్బంది సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా మెన్ గ్రీవెన్స్ కాకినాడ జిల్లా ఎస్పీ జి బిందు మాధవ్ నిర్వహించారు.ప్రతి శుక్రవారం పోలీసు సిబ్బంది సంక్షేమం దృష్ట్యా నిర్వహించే గ్రీవెన్స్ లో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో పలువురు పోలీసు సిబ్బంది స్వయంగా ఎస్పీని కలిసి వారి సమస్యలపై అర్జీలు సమర్పించారు. దరఖాస్తులు స్వీకరించిన ఎస్పీ వారి సమస్యల పరిష్కారానికి సానుకూలంగా స్పందించారు. నిత్యం వివిధ రకాల డ్యూటీలలో పని ఒత్తిడితో ఉండే సిబ్బంది కోసం శుక్రవారం కేటాయించి, వారి వద్ద నుండి ఉద్యోగపరంగా లేదా వ్యక్తిగత సమస్య ఏదైనా దరఖాస్తు చేసుకోవడానికి ఈ వెసులుబాటు కల్పించారు. దీనిపై కాకినాడ జిల్లా పోలీస్ సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జనగణన - 2027పై శిక్షణ...



**గుడ్లవల్లేరు:ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)** శేషాద్రిరావు గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహిస్తున్న జనగణన -- 2027పై శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ మాట్లాడుతూ, జనగణన కార్యక్రమం దేశాభివద్ధికి ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రతి గణకుడు (ఎన్యుమరేటర్) మరియు పర్యవేక్షకుడు (సూపర్‌వైజర్) తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. గహాల వివరాలు, జనాభా సమాచారం సరిగ్గా సేకరించాల్సిన అవసరాన్ని వివరించారు.

## 23వరకు పోషణ పక్వాడ...



**గుడ్లవల్లేరు:ఏప్రిల్ 10 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలో నిర్వహిస్తున్న పోషణ పక్వాడ ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఎండీ ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం గుడ్లవల్లేరులో నిర్వహించిన పోషణ పక్వాడ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు మరియు చిన్నపిల్లల ఆరోగ్యం, పోషణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అంగన్వాడీ సిబ్బంది, ఆశా, అచీవీలు సమన్వయంతో పనిచేసి ప్రతి లబ్ధిదారునికి సేవలు అందించాలని తెలిపారు. పోషణ పక్వాడలో భాగంగా ప్రతి రోజు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు, పోషకాహార ప్రదర్శనలు విజయవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎండీ నసీరున్నీసా, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రజలకు చేరువ గా పోలిసింగ్

### పోలీస్ కమిషనర్ డా.ఎం.రమేష్



**సైబరాబాద్,ఏప్రిల్ 10 (వార్తాప్రభ)**:ప్రజలకు చేరువగా పోలీసింగ్ నిర్వహిస్తూ నేర నియంత్రణపై దృష్టి సారించాలని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం.రమేష్ పేర్కొన్నారు.శుక్రవారం కమిషనరేట్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఉన్నతాధికారులు, ఎస్‌హెచ్ఓలు పాల్గొన్నారు.విజిబుల్ పోలీసింగ్,ఫుట్ పెట్రోలింగ్ పెంచాలని, 'ఎఫ్ఐఆర్ ఎట్ హోమ్' విధానాన్ని సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు.బక్రీద్ పండుగల నేపథ్యంలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి,డయల్ 100 కాల్స్‌కు తక్షణ స్పందన ఇవ్వాలని సూచించారు.సీసీ కెమెరాల ఏర్పాటు విస్తరించడంతో పాటు,'సీ ఈ ఐ ఆర్' పోర్టల్ వినియోగంపై అవగాహన పెంచాలని తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు.మహిళలు, పిల్లలపై నేరాల దర్యాప్తుకు ప్రాధాన్యత ఇవ్వాలని,రౌడీ షీటర్లు,డ్రగ్స్ కేసులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పెండింగ్ కేసులను త్వరగా పరిష్కరించి,చార్జ్‌షీట్లు సకాలంలో దాఖలు చేయాలని సూచించారు.ఈ సమావేశంలో వివిధ జోన్‌ల డీసీపీలు,ఇతర అధికారులు పాల్గొన్నారు.

## విజయవాడ శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానం కొండ చరియల పటిష్టతపై 'నిర్మ్' (ఎన్ ఐ ఆర్ ఎమ్) బృందం అధ్యయనం






**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 10:(వార్తా ప్రభ ప్రతినిధి)**ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన పరిధిలోని కొండ చరియల పటిష్టతను శాస్త్రీయంగా అధ్యయనం చేసేందుకు బెంగళూరులోని నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ ( ఎన్ ఐ ఆర్ ఎమ్) నుండి సాంకేతిక బృందం ఈరోజు ఉదయం దేవస్థానానికి చేరుకుంది. ప్రముఖ శాస్త్రవేత్త ప్రసన్న జైన్ నేతృత్వంలోని ఈ బృందం దేవస్థాన కార్యనిర్వహణాధికారి శీనా నాయక్ ను కలిసి, క్షేత్రస్థాయి పరిశీలనపై కావలసిన ఏర్పాట్లు పై చెక్ లిస్ట్ సమర్పించి, చర్చించారు.?ఈ సందర్భంగా అధ్యయన బృందం పలు కీలక అంశాలను వివరించింది.? కొండపై తరచుగా రాళ్లు జారిపడుతున్న ప్రాంతాలు, ప్రస్తుతం పటిష్టంగా ఉన్న రాళ్ల విస్తీర్ణం, మట్టితో మిళితమై ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలను అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ బృందం విశ్లేషించనుంది.? భవిష్యత్తులో కొండపై నిర్మించతలపెట్టిన 'పాశుపాతాలయం' ప్రదేశం యొక్క భూగర్భ పటిష్టతను, అలాగే 2వ ఘాట్ రోడ్డు నిర్మాణానికి ఉన్న అనుకూల పరిస్థితులను ఈ బృందం క్షుణ్ణంగా పరిశీలించనుంది.?దేవస్థాన అభివృద్ధి కోసం రూపొందించిన మాస్టర్ ప్లాన్‌కు అనుగుణంగా, భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఈ అధ్యయన నివేదికను సిద్ధం చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు.?అత్యాధునిక పరికరాల సహాయంతో నిర్వహించే ఈ సర్వే అనంతరం, కొండ చరియల పటిష్టతకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు శాశ్వత పరిష్కార మార్గాలతో కూడిన సమగ్ర నివేదికను దేవస్థానానికి సమర్పించనున్నట్లు నిర్మ్ బృందం వెల్లడించింది. నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ అనేది గనులు, సివిల్ ఇంజనీరింగ్ మరియు మౌలిక సదుపాయాల రంగంలో రాళ్ల స్వభావాన్ని అధ్యయనం చేసే భారతదేశంలోని అత్యున్నత స్థాయి పరిశోధనా సంస్థ.ఇంద్రకీలాద్రి వంటి కొండ ప్రాంతాల్లో నిర్మ్ చేసే పని తీరు మరియు ప్రాముఖ్యత ఇలా ఉంటుంది.

**1. రాళ్ల పటిష్టత పరీక్ష** ?కొండ ఏ రకమైన రాళ్లతో నిర్మితమైందో వీరు అత్యాధునిక సెన్సార్ల ద్వారా పరీక్షిస్తారు. రాళ్ల మధ్య ఉన్న పగుళ్లు, వాటి లోతు, మరియు వర్షం పడినప్పుడు ఆ పగుళ్లలోకి నీరు చేరి రాయి బలహీనపడే అవకాశం ఎంత ఉందనేది వీరు శాస్త్రీయంగా లెక్కిస్తారు.

**2. స్లోప్ స్టెబిలిటీ** ?కొండ చరియలు విరిగి పడకుండా ఉండటానికి వీరు ప్రత్యేక పద్ధతులను సూచిస్తారు. ఏ ఏ కోణాల్లో కొండ రాయి వాలి ఉందో చూసి, ఎక్కడ రక్షణ గోడలు కట్టాలి, ఎక్కడ 'రాక్ బోల్టింగ్' (పెద్ద మేకులతో రాళ్లను బిగించడం) చేయాలి అనేది వీరు నిర్ణయిస్తారు. **3. అత్యాధునిక సాంకేతికత వాడకం**?గ్రౌండ్ పెనెట్రేటింగ్ రాడార్ (జి పి ఆర్): కొండ లోపల మట్టి ఎంత ఉంది, రాయి ఎంత ఉందనేది తవ్వకుండానే తెలుసుకోవడానికి దీన్ని వాడతారు.మైక్రో-సీస్మిక్ మానిటరింగ్: కొండలో వచ్చే అతి చిన్న ప్రకంపనలను కూడా గుర్తించి, భవిష్యత్తులో ప్రమాదం పొంచి ఉంటే ముందుగానే హెచ్చరిస్తారు.

**4. భారీ నిర్మాణాలకు పునాది విశ్లేషణ** ?మీరు పేర్కొన్న పాశుపాతాలయం లేదా 2వ ఘాట్ రోడ్ వంటి భారీ నిర్మాణాలు చేపట్టేటప్పుడు, ఆ బరువును కొండ భరించగలదా లేదా అని 'లోడ్ టెస్టింగ్' చేస్తారు. నిర్మాణం వల్ల కొండపై అదనపు ఒత్తిడి పడకుండా డిజైన్లను సూచిస్తారు.

**5. పర్యావరణ సమతుల్యత** ?కేవలం సిమెంట్ గోడలు కట్టడమే కాకుండా, ప్రకృతిసిద్ధంగా కొండను ఎలా కాపాడుకోవాలో వీరు నివేదికలు ఇస్తారు. గనులు మరియు సొరంగాల నిర్మాణంలో వీరికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు ఉంది. ఇంద్రకీలాద్రిపై భక్తుల భద్రతను నిర్ధారించడానికి మరియు శాశ్వతమైన నిర్మాణాలను చేపట్టడానికి నిర్మ్ ఇచ్చే సాంకేతిక నివేదిక ఒక 'బ్లూ ప్రింట్' లాగా పనిచేస్తుంది. ఇది దేవస్థానానికి భవిష్యత్తులో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ముందస్తు రక్షణ కవచం లాంటిదని ఈవో పేర్కొన్నారు.ఈ బృందంతో సాంకేతిక సలహాదారు శ్రీ సుబ్రహ్మణ్యం, దేవస్థానం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు

### - ఎంపీ కేశినేని, ఎమ్మెల్యే వసంత



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 10 (వార్తా ప్రభ ప్రతినిధి):** పట్టణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, టీడీపీ జిల్లా అధ్యక్షురాలు గద్దె అనురాధ తెలిపారు. కొండపల్లి పట్టణ పరిధిలోని ఇబ్రహీంపట్నం భీమరాజు గుట్ట సెంటర్ లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎగ్ కర్ట్ కేంద్రాన్ని గురువారం రాత్రి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యాపారస్తులకు, యువతకు ఇది ఆర్థికంగా లాభదాయకంగా మారుతుందన్నారు. ఈ కేంద్రం ద్వారా స్థానికులకు ఉపాధి లభించడంతో పాటు గుడ్ల నిల్వ, పంపిణీ సులభతరమవుతు ందన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా ఇలాంటి ప్రాజెక్టులు మరిన్ని తీసుకురావాలని సూచించారు. మెప్మా పీడీ పి.మురళీ కృష్ణ ప్రసాద్ ప్రభుత్వం అందించిన ఎగ్ కర్ట్ పరికరాల గురించి అందరికీ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నుబోయిన చిట్టిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జంపాల సీతారామయ్య, కౌన్సిలర్లు పులి అరుణ కుమారి, చుట్టుకుదురు వాసు, పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు చుట్టుకుదురు వెంకటేశ్వరమ్మ, మెప్మా సీఎంఎం శ్రీధర్, టెక్నికల్ ఎక్స్ పర్ట్ ఎస్.సుధారాణి, రవి, సీవోలు, ఆర్పీలు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

# హెూమియో వైద్యాన్ని ఆదరిద్దాం !





**గుడివాడలో ఘనంగా ప్రపంచ హెూమియో దినోత్సవం.. వేడుకలల్లో పాల్గొన్న అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి. అరుంధతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి లు.. సన్‌స్ట్రోక్ నివారణకు హెూమియోపతి ఔషధాలు పంపిణీ.. వందలాది మందికి మజ్జిగ పంపిణీ..**

**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** ఆరోగ్య గుడివాడ గా మార్చే లక్ష్యంతో ఆయుష్ సేవలు, యోగాను రోజువారీ జీవితంలో భాగం చేసుకోవాలని అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి. అరుంధతి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పి. గాయత్రి లు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక డా॥ గురురాజు గవర్నమెంట్ హెూమియోపతి ఆసుపత్రిలో హెూమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హానిమన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా కాలేజీ ప్రాంగణంలో ఉన్న హెూమియో పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తులు అరుంధతి, గాయత్రి లు మాట్లాడుతూ యోగ సాధన ద్వారా శారీరక మరియు మానసిక ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. ఆరోగ్య సంరక్షణలో హెూమియోపతి ప్రాముఖ్యత రోజురోజుకి పెరుగుతోంది. దుష్ప్రభావాలు తక్కువగా ఉండటం, తక్కువ ఖర్చుతో చికిత్స అందుబాటులో ఉండటం, అన్ని వయసుల వారికి అనుకూలంగా ఉండటం దీని ప్రధాన ప్రయోజనాలు.. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఈ సేవలను విస్తరించి ప్రతీ ఒక్కరికీ చేరువ చేయడంపై దృష్టి సారించాలనీ కోరారు. అనంతరం ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని పాదచారులకు ఉచిత మజ్జిగ పంపిణితో పాటు అలాగే సన్‌స్ట్రోక్ నివారణకు హెూమియోపతి ఔషధాలు పంపిణి చేశారు. పై కార్యక్రమాలల్లో ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ టివి ఆర్ ఎస్ఎన్ జగదీశ్వరరావు, కాలేజీ ప్రిన్సిపల్ డా॥ డి రమాదేవి, ఎస్ ఎం.ఓ. ఫ్లోరెన్స్, డా॥ జ్యోతి లు ఎం.ఓ. డా॥ నాగేంద్ర, డా॥ హేమలత, డా॥ రేవంత్ లు న్యాయవాదులు తుమ్మలచర్ల శ్రీనివాసులు, వై మురళీకృష్ణ ఇతరులు అలాగే కాలేజీ & హాస్పటిల్ స్టాఫ్, పోస్ట్‌గ్రాడ్యుయేట్ విద్యార్థులు, జూనియర్ డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# గుడివాడ లో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల.అభివృద్ధి : ఎమ్మెల్యే రాము

**● మౌలిక వసతులు కల్పన పై.. అర్బన్ గ్రీనరీ డెవలప్మెంట్ అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే...**



**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** గుడివాడ పట్టణ వ్యాప్తంగా త్రాగునీరు అందించే ప్రధాన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. అర్బన్ గ్రీనరీ & డెవలప్మెంట్ అండ్ మున్సిపల్ పబ్లిక్ హెల్త్ అధికారులతో స్థానిక పురపాలక సంఘ కార్యాలయంలో ఎమ్మెల్యే రాము శుక్రవారం సమావేశం అయ్యారు. పట్టణంలోని ప్రధాన సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల అభివృద్ధి, బేతవోలులో అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ, సుదీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న చెరువు సమస్యలపై అధికారులతో ఎమ్మెల్యే రాము చర్చించారు. అర్బన్ గ్రీనరీ డెవలప్మెంట్ నిధులతో చేయనున్న అభివృద్ధి పనులపై అధికారులకు ఎమ్మెల్యే రాము పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ.. హెడ్ వాటర్ వర్క్స్ వద్దగల పాత, కొత్త సమ్మర్ స్టోరేజీ ట్యాంకుల గట్లు పటిష్టతకు చర్యలు తీసుకుంటున్నామనీ, అందుకు అవసరమైన నల్ల మట్టిని ముందే సిద్ధం చేసేలా దృష్టి పెట్టినట్లు తెలిపారు. నాగన్న చెరువు అభివృద్ధికి సమావేశంలో చర్చించామన్నారు. అర్బన్ గ్రీనరీ నిధులతో పట్టణంలో పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్థానికులు ఇచ్చిన విజ్ఞప్తుల మేరకు బేతవోలు చెరువులో డ్రాప్ట నిర్మాణం చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే రాము వెల్లడించారు. అర్బన్ డెవలప్మెంట్ నిధులు రూ.2.5 కోట్లతో బేతవోలులో డ్రైనేజీల నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. జనసేన ఇన్చార్జి బూరగడ్డ శ్రీకాంత్, కమిషనర్ ఎస్ మనోహర్, ఎంఇ ప్రసాద్, ఏఓ జిటి నాయుడు, ఏపీ జిబిసి ఎస్.సి. చంద్రశేఖర్, జోనల్ మేనేజర్ బేబీ, ఇంజనీరింగ్ టీం, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత

**-ఏఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాలలో వాలీబాల్ పోటీలు**





**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** అక్కినేని నాగేశ్వరరావు ఇంజనీరింగ్ కాలేజ్‌లో స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్.ఏ.సి.) ఆధ్వర్యంలో వాలీబాల్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా నిర్వహించబడ్డాయి. కళాశాల ప్రాంగణం విద్యార్థుల సందడితో కళకళలాడగా, క్రీడా స్ఫూర్తి ప్రతిభావంతంగా ప్రతిఫలించింది. ఈ పోటీలను సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ మరియు ఆంధ్రప్రదేశ్ స్టేట్ వాలీబాల్ రిఫరీ అయిన వి. మృత్యుంజయ ఆధ్వర్యంలో కళాశాల వ్యాయామ అధ్యాపకులైన వీర్ల గోపి నిర్వహించారు. ఆయన పర్యవేక్షణలో పోటీలు క్రమబద్ధంగా సాగుతూ, నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవడం జరిగింది. పోటీలు ప్రారంభానికి ముందు విద్యార్థులకు క్రీడల ప్రాముఖ్యత, నియమాలు మరియు క్రీడాస్ఫూర్తి గురించి అవగాహన కల్పించారు. పోటీలలో కళాశాల వివిధ విభాగాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు. జట్లు పరస్పరం పోటీ పడి తమ నైపుణ్యం, సమన్వయం మరియు ధైర్యాన్ని ప్రదర్శించాయి. విజేతలుగా నిలిచిన జట్లకు మరియు ప్రతిభ కనబరిచిన ఆటగాళ్లకు కళాశాల యాజమాన్యం చేత బహుమతులు అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఆరిగ రామారావు మాట్లాడుతూ, "మా సంస్థలో విద్యతో పాటు క్రీడల కు కూడా సమాన ప్రాధాన్యత ఇస్తామని , విద్యార్థుల శారీరక, మానసిక అభివృద్ధికి క్రీడలు ఎంతో అవసరమని ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందుతాయని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ ప్రెసిడెంట్ ఎల్. ఆర్. కే .ప్రసాద్ , సెక్రటరీ కరస్పాండెంట్ కె. ఎస్. అప్పారావు, అధ్యాపకులు, సిబ్బంది మరియు విద్యార్థులు పాల్గొని పోటీలను విజయవంతం చేశారు. కార్యక్రమం చివర్లో విజేతలకు అభినందనలు తెలుపుతూ, భవిష్యత్తులో ఇంకా మరిన్ని క్రీడా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

# శారీరక ధృడత్వం తోనే మెరుగైన సేవలు



**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు ఆదేశాల మేరకు, గుడివాడ సబ్ డివిజన్ ఇంచార్జ్ డిఎస్పీ చలసాని శ్రీనివాసరావు, సి.ఐ గుడివాడ రూరల్ ఎస్.ఎల్.ఆర్. సోమేశ్వరరావు ఆధ్వర్యంలో, గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో కార్యక్రమం నిర్వహించబడినది. ఈ కార్యక్రమంలో భాగంగా, స్టేషన్ పరిధిలోని పోలీసు సిబ్బంది శారీరక ధృఢత్వం, క్రమశిక్షణ మరియు ఆరోగ్య పరిరక్షణ దృష్ట్యా పరేడ్ మరియు వ్యాయామ కార్యక్రమాలు నిర్వహించబడినవి. పోలీసు సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండటం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరని తెలియజేసారు. అలాగే విధుల్లో అలసటను తగ్గించుకోవడం, ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టడం మరియు క్రమబద్ధమైన జీవన శైలిని పాటించడం పై అవగాహన కల్పించబడినది. ఈ కార్యక్రమంలో గుడివాడ రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐ ఎన్. చంటి బాబు మరియు స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

# మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో అన్నదానం



**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** శుక్రవారం మధ్యాహ్నం ఎ.జి.కె హైస్కూల్ ప్రక్కనగల అన్నాక్యాంటీన్ నందు మానవతా స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో స్వర్గీయ కొడాలి అప్పారావు ప్రధమ వర్ధంతి సందర్భంగా సతీమణి కొడాలి క్రృష్ణకుమారి, కుమార్తె జాస్తి పద్మలత, మనుమరాళ్ళు డాక్టర్ పల్లవి, డాక్టర్ హారిక, మనుమడు జాస్తి పునీత్ లు ఈ అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కీర్తిశేషులు కొడాలి అప్పారావు ఆత్మకు శాంతి చేకూరాలని, మరియు వారి కుటుంబసభ్యులు అభివృద్ధిలోకి రావాలని మానవతాసంస్థ అభిలషిస్తున్నది. ఈ కార్యక్రమంలో గుడివాడ మానవతాశాఖ అధ్యక్షులు దండమూడి సీతారామ స్వామి, ఉమ్మడి క్రృష్ణాజిల్లా సమన్వయ కమిటీ చైర్మన్ పొట్లూరి వీరశేషగిరిరావు, పర్యావరణ పరిరక్షణ కమిటీ చైర్మన్ దండమూడి జయలక్ష్మి, గుడివాడ మానవతాశాఖ కన్వీనర్ మరియు క్రృష్ణాజిల్లా విద్యానిధి డైరెక్టర్ ఉప్పలపాటి మారుతీప్రసాద్, గుడివాడ మానవతాశాఖ ఉపాధ్యక్షులు ఘంటసాల రామకృష్ణ, కార్యదర్శి నందమూరి పద్మజ, కోశాధికారి బచ్చు.రాధాకృష్ణ, జాయింట్ సెక్రటరీ చలువాది మోహనరావు, డైరెక్టర్ పిన్నమనేని రామచంద్రరావు, సభ్యులు సాంబశివరావు, వెంకటేశ్వరరావు, వీరమాచనేని శైలజ, ఇతర సభ్యులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

# పన్ను చెల్లింపుదారులకు పర్యావరణ ప్రోత్సాహక చర్యలు



**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** గుడివాడ పురపాలక సంఘం ఆధ్వర్యంలో సమయానికి పన్నులు చెల్లించిన పన్ను చెల్లింపుదారులను ప్రోత్సహించేందుకు ఎవరైతే ముందస్తు పన్ను చెల్లించారో వారికి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము క్లాత్ బ్యాగ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజలు పన్నులు చెల్లించడంతోపాటు పర్యావరణాన్ని కాపాడడంలా భాగంగా సింగల్ యుజ్ ప్లాస్టిక్ నిషేధించి క్లాత్ బ్యాగులను వాడకాన్ని ప్రోత్సహించడం కోసం ఈ కార్యక్రమం ప్రవేశ పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి గుడివాడ శాసనసభ్యులు వెనిగండ్ల రాము, పురపాలక కమిషనర్ ఎస్. మనోహర్ లు హాజరై, పన్నులు చెల్లించడం ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు నగర అభివృద్ధికి ముఖ్య భాగస్వాములని పేర్కొన్నారు.

# 12నుండి పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వార్షిక ఆరాధన మహెూత్సవములు

**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** పట్టణం లోని బంటుమిల్లి రోడ్ శ్రీనివాస సెంటర్ నందు విశ్వబ్రాహ్మణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి 55వ వార్షిక ఆరాధన మహెూత్సవములు పందిరి రాట ఈనెల 12వ తేది ఆదివారం ఉదయం శ్రీ పరాభవ నామ సంవత్సర చైత్ర బహుళ దశమి ఆదివారం ఉదయం గం॥ 08 -38 ని॥లకు శ్రవణ నక్షత్ర యుక్త వృషభ లగ్నము నందు పందిరి రాట నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. అలాగే ఈనెల 18వ తేది శనివారం ఉదయం 10.15 ని॥లకు కలశస్థాపన జరుగుతుందన్నారు. 23వ తేది గురువారం ఉదయం 10.55 ని.లకు వైశాఖ శుద్ధ సప్తమి పునర్వసు నక్షత్ర యుక్త మిధులనలగ్న పుష్కరాంశము నందు స్వామి వారి జగత్ కళ్యాణము జరుగునని తెలియజేశారు. సాయంత్రం గం 4.30 ని॥కు శ్రీ స్వామి వారి గ్రామోత్సవము (ఊరేగింపు) అలాగే 26వ తేదిన ఆదివారం వైశాఖ శుద్ధ దశమి స్వామి వారి ఆరాధన, జీవ సమాధి పూజ కార్యక్రమాలు.. అన్నసమారాధన ది. 09-05-2026 శనివారం మధ్యాహ్నం 12 గం॥లకు జరుగుతుందన్నారు. కావున భక్తులు యావన్మంది పైకర్యక్రమాల్లో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

# సాతులూరులో వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ కార్యక్రమం...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం శుక్రవారం సాతులూరు గ్రామంలో వికసిత్ భారత్ - గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ (గ్రామీణ)పై అవగాహన కార్యక్రమం బంటుమిల్లి మండల బిజెపి అధ్యక్షుడు జల్లూరి కిరణ్ గుప్త అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమంలో నగరాయులు ఉపాధి హామీ పథకాన్ని గత ప్రభుత్వాలు ఎలా నిర్వీర్యం చేసి ప్రజలకు సరిగా అందకుండా చేశాయో తదుపరి ఎన్డీఏ ప్రభుత్వం మోడీ సారథ్యం లో ఈ పథకాన్ని ఎంత ఉన్నతంగా తీర్చి దిద్దిందో వివరించారు అలాగే ఈ పథకానికి చట్టబద్ధత కల్పించారు అని తెలియజేశారు. పని దినాలు పెంచడం వల్ల మరియు వేతనం పెంచడం వల్ల ఇటువంటి పనులు లేని కాలంలో గ్రామాల్లోని కార్మికులకు బడుగు బలహీనత వర్గాల వారికి ఎంత ఎంతగా ఉపయోగపడుతుందో వివరించారు పని దినాలు పెంచడంపై మరియు వేతనం పెంచడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు మరియు ఉపాధి హామీ పనుల్లో వచ్చే ప్రజల సమస్యలు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సాతులూరు గ్రామ బిజెపి నాయకులు తాడిసెట్టి రామారావు, సునీల్, తరుణ్, పార్టీ కార్యకర్తలు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు...

# చలో మంగళగిరి పద్మశాలియ మహాసభ కరపత్రం ఆవిష్కరణ



**విస్సన్నపేట,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** స్థానిక ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 26వ తేదీ ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు మంగళగిరిలో జరుగు పద్మశాలి మహాసభ ఆహ్వాన పత్రికను స్థానిక పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు గుడ్డల రాంబాబు ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి ఉద్యోగ సంఘ అధ్యక్షుడు పెండెం వెంకట రామకృష్ణ, రాష్ట్ర కార్యదర్శి పెండెం భవనారాయణ, అసోసియేట్ అధ్యక్షులు పి ఎస్ వి సత్యనారాయణ, కార్యదర్శి వెంగళ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు పివి రామకృష్ణ మాట్లాడుతూ చట్ట సభలలో పద్మశాలీల హక్కుల సాధనకై ఏకంకావాలని మన హక్కులను మనం సాధించుకునేందుకు విద్యార్థులు ఉద్యోగస్తులు మరియు కులవృత్తి అభివృద్ధి కొరకు రాజకీయాలలో పద్మశాలి కులం ప్రాధాన్యత కొరకు శ్రీ పద్మావతి అమ్మవారి పుట్టింటి వారిమైన మనకు టీటీడీ ధర్మకర్తల మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించాలని తిరుమల కొండపై మార్కండేయ మఠం నిర్మాణమునకు ప్రభుత్వం స్థలం కేటాయించాలని సమిష్టి పోరాటాన్ని రాష్ట్ర పద్మశాలి జగ్గారపు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ముందుకు వెళదామన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బార్



**కంచికచర్ల,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** ప్రజా సమస్యలు పరిష్కార వేదిక ఈ ప్రజా దర్బార్ని నందిగామ శాసనసభ్యురాలు ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. ప్రజా దర్బార్ కార్యక్రమంలో భాగంగా మండల పరిధిలోని మోగులూరు సచివాలయం నందు శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, అధికారులువిచ్చేశారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలపై పలు అర్జీలను ఎమ్మెల్యేకు నేరుగా అందజేయడం జరిగినది. ఇండ్ల స్థలాలు, గ్రామంలో ప్రధానంగా రోడ్లు డ్రైనేజీలు కాలువల నందు పూడికతీత తీయకపోవడంతో మురుగు నీరు అంతా రోడ్లమీదకు చేరుతుందని అలాగా నీరు ఇండ్లలోకి చేరుతుందని ఎమ్మెల్యేకి ప్రజలు తెలియజేయడం జరిగినది. ముఖ్యంగా క్రైస్తవులు మైనారిటీలు భరీల గ్రౌండ్ నందు బోర్లు వేయాలని గ్రామంలో15 రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేకి ప్రజలువిన్నవించారు. అలాగే మొక్కజొన్న సెనగలు వెంటనే ప్రభుత్వం కొనుగోలు చేపట్టాలని రైతులు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య కి తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ తంగిరా సౌమ్య రైతన్నతోపాటు ప్రజలనూ దేశించి మాట్లాడుతూ మొగులూరు గ్రామంలో నెలకొన్న సమస్యలను ఒకదాని ఒకటి తీర్చుకుందామని వేసవికాలం కాబట్టిత్రాగు నీరు సమస్యను తలెత్తకుండా చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందని అధికారులు త్రాగునీరు గ్రామ ప్రజల అందేలా చర్యలు చేపట్టాలన్నారు. పూడిక తీత పనులలో జాప్యం లేకుండా కాలువలలో వెంటనే తీసివేయాలని అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అధికారులు రహదారులు మరమ్మతులు మరియు నిర్మాణ అంచనాలు తయారు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వం మొక్కజొన్న శనగలు కొనుగోలు చేపట్టనున్నట్లు ఆమె రైతులకు తెలియజేశారు. ఈ సమస్యను త్వరగా పరిశీలించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆమె సూచించారు. గ్రామం నెలకొన్న సమస్యలను త్వరితి గతిన పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మార్కెటింగ్ యార్డు ఉపాధ్యక్షులు కోగంటి బాబు ఎమ్మార్వో నరసింహారావు ఎంపీడీవో వెంకటేశ్వరరావు డిప్యూటీ ఎంపీడీవో అప్పారావు టిడిపి గ్రామ పార్టీ అధ్యక్షులు వెలగా నరసయ్య సొసైటీ అధ్యక్షులు వెలగా రామకృష్ణ తిరుపతిరావు చిన్న నరసింహారావు (డి.ఏ.పీ.) గద్దె పవన్ కుమార్ బంక కోటేశ్వరరావు బంక సీతయ్య బండి కోటేశ్వరరావు మాలిక్ రహీం జంగా సత్యనారాయణ ఆదిపూడి శివగంగారావు ఏవో కే వెంకటేశ్వరరావు పి ఆర్ఏఈ రవికుమార్ ఆర్డబ్ల్యూఎస్ ఏఈ నరసింహారావు ఏపీ ఓ రమాదేవి ఏటీఎం విజయ కుమారి నాని బాబు పలువురు అధికారులతో పాటు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# అంగన్వాడీలలో పోషణ పక్వడ కార్యక్రమాలు



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** బాబులపాడు మండలం దంటా గుంట్ల, గ్రామంలో పోషణ పక్వడ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ఐసిడిఎస్ పరిధిలోని అన్ని గ్రామాలలో అంగన్వాడీ టీచర్స్ ద్వారా గర్భిణీ స్త్రీలకు బాలింతలకు పోషణ ఆహారం అనేటువంటి కార్యక్రమాలు నిర్వహించి, ఆరోగ్యవంతమైన టువంటి ఆహారాన్ని వారికి ఎలా అందించాలి, వారు ఆరోగ్యంగా ఎలా ఉండాలి, ఎటువంటి ఆహారం తీసుకోవాలి, అనే విషయాలు పై ఈ నెల 9 నుండి,23 వరకు కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఐసిడిఎస్ ఆఫీసర్ స్వయంగా కార్యక్రమంలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది అని అన్నారు. దంటాగుంట్ల, కాకులపాడు, రామన్నగూడెం గ్రామాల్లో ఉన్నటువంటి మదర్స్ అందరిని పిలిపించి ఎవరైతే అంగన్వాడి స్కూల్లో ఇన్వాల్వ్మెంట్ ఉన్నారో ఆ తల్లులందరిని కూడా అంగన్వాడి స్కూల్ కి పిలిపించి ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సూపర్వైజర్ ద్వారా టీచర్స్ అందరిని మొబిలైజ్ చేయడమే కాకుండా తల్లుల అందరికీ ఆహారం ఏరకంగా తీసుకోవాలి, పిల్లలను ఏ రకంగా కాపాడుకోవాలి, ముఖ్యంగా మదర్స్ తీసుకున్నటువంటి ఆహారంలో ఏ రకమైనటువంటి పోషణ ఉన్నటువంటి ఆహారం తీసుకోవాలనే కార్యక్రమం మీద ఐసిడిఎస్ అధికారిణి ప్రత్యేకంగా ప్రసంగించి వాళ్ళందరినీ కూడా ఉత్తేజపరిచినట్లుగా కాకులపాడు స్కూల్ అంగనవాడి టీచర్ కాలి విజయలక్ష్మి ఈ కార్యక్రమం గురించి తెలియజేశారు. 15 రోజులు పోషక పక్వడ కార్యక్రమాన్ని జరుగుతున్నట్లుగా సి డి పి ఓ జీ మంగమ్మ తెలిపారు. శుక్రవారం కాకుల పాడు పరిధిలోని దండగుంట్ల అంగన్వాడీ స్కూల్ లో గర్భిణీ స్త్రీల కు బాలింతలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీ దాల్చిన రోజునుండి డెలివరీ అయిన 1000రోజులవరకు బాలింతలు, గర్భిణీలు తీసుకోవలసిన పోషకాహారం జాగ్రత్తలు గురించి వివరించారు. చిన్న పిల్లలకు రెండు సంవత్సరాల పిల్లలకు పెట్టవలసిన పోషక ఆహారం, చిన్న పిల్లలకు చాక్లెట్లు జంక్ ఫుడ్స్ ఇవ్వకూడదని, చిన్న పిల్లలకు ఫోన్స్ ఇవ్వరాదని, ఇంట్లో బయట మాత్రమే ఆటలు ఆడించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సి డి పీ ఓ జీ మంగమ్మ, సూపర్వైజర్ ఝాన్సి రాణి, ఏ ఎన్ ఎం, ఆశావర్కర్ల, అంగన్వాడీ టీచర్లు గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రం -2 లో పోషణ పక్వాడ కార్యక్రమం



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** చిలకల్లు ప్రాజెక్టు సిడిపిఓ సత్యవాణి ఆదేశాల మేరకు పెనుగంచిప్రోలు గ్రామంలోశుక్రవారంపెనుగంచిప్రోలు లో అంగన్వాడీ కేంద్రం-2 నందు పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో చిన్నపిల్లలకు స్మార్ట్ ఫోన్స్ ఇవ్వటం వలన కలిగే అనర్థాలను గురించి గర్భవతులుకు బాలింతలకు ప్రీస్కూల్ పిల్లల తల్లిదండ్రులకు వివరించడం జరిగింది ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు తల్లులు అంగన్వాడి కార్యకర్తలు హెల్పర్స్ పాల్గొన్నారు.

# ఏపీ చేనేత కార్మిక సంఘం 90 వ వార్షికోత్సవం



**పెడన,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం 9శీ వార్షికోత్సవశీ శుక్రవారం పెడనలో జరిగింది. ఈసందర్భంగా సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షులు కట్ట హేమ సుందర్ రావు మాట్లాడుతూ 1936వ సంవత్సరంలో సహకార సంఘా లు స్థాపించేందుకు కామ్రేడ్ పుచ్చల సత్యనారాయణ మెట్ల వీరయ్య ఎర్ర త్రిశూలపాణి టం టం శ్రీమన్నారాయణ మొదలైన వారి నాయకత్వంలో ఉప్పాడ లో స్థాపించడం జరిగింది 1936 నుంచి 1944 వరకు కృష్ణాజిల్లాలో 26 సంఘాలు స్థాపించడం జరిగినది చేనేత కార్మికులకు ఉపాధి కల్పిస్తూ చేనేత సొసైటీలు ఉజ్వలంగా విరాజిల్లాయి తదుపరి అనేక సంఘాలు స్థాపించి వేలాది మంది చేనేత కార్మికులకు ఉపాధి కల్పించడం జరిగినది కానీ ఈరోజు సొసైటీల పరిస్థితి చూస్తే కంటి నీరు వచ్చే విధంగా తయారయినాయి సహకార సంఘాలకు రావలసిన బకాయిలు విడుదల చేయక సంవత్సరాలు గడిచి పోతున్నా ప్రభుత్వం నెమ్మకు నిరీత్తినట్టు వ్యవహరిస్తుంది ఎన్ని ఉద్యమాలు చేసినా ఈ ప్రభుత్వం దున్నపోతు మీద వాన పడినట్టుగా దులిపేసుకుంటుంది చేనేత పరిశ్రమపై జీఎస్టి రూపంలో వేల కోట్ల రూపాయలు దండుకుంటూ చేనేత బడ్జెట్లో 115 కోట్లు చూపిస్తూ ఐదు కోట్ల రూపాయలు మాత్రమే చేనేతకు కేటాయింపులు ఉన్నవి ఇంత దారుణమైన ప్రభుత్వం చరిత్రలో లేదని మార్చాల్సిన బాధ్యత ప్రతి చేనేత కార్మికుడి పైన ఉందని కట్ట హేమ సుందర్ రావు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా చేనేత కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి కోసం బాలసుబ్రమణ్యం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాల గురునాథ రావు పడవల కోటిలింగం రావూరు వీరభద్రుడు కురుమ విగ్నేశ్వర రావు బట్ట రవీంద్ర తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా యుసీయూకే వార్షికోత్సవ వేడుకలు



**కాకినాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** జెఎన్టియుకె ప్రాంగణంలో శుక్రవారం అలూమ్ని ఆడిటోరియం నందు యుసిఇకె వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్, విచ్చేయగా ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ఎకె.ప్రసాద్, రెక్టార్ ప్రొ.పి. సుబ్బారావు, ఓఎస్ ప్రొ.డి. కోటేశ్వరరావులు వేదికనలంకరించారు. యుసిఇకె ప్రిన్సిపాల్ ప్రొ.కె. పద్మరాజు కార్యక్రమానికి అధ్యక్షత వహించగా యుసిఇకె వైస్ ప్రిన్సిపాల్స్ ప్రొ.జివిఎస్ఆర్.దీక్షితులు, ప్రొ.ఎం.స్వరూపారాణి కో-ఆర్డినేటర్లుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ మాట్లాడుతూ తన కాలేజీ రోజుల అనుభవాలను పంచుకున్నారు. విద్యార్థుల ప్రధాన బాధ్యత చదువు అని, ప్రపంచం ఎంతో పోటీతో కూడుకున్నదని అన్నారు. కృత్రిమ మేధస్సు (AI) కారణంగా ఉద్యోగ రంగంలో మార్పులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా విద్యార్థులు పరిశ్రమలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. సామాజిక మాధ్యమాలలో సమయాన్ని వృథా చేయకుండా, నిజజీవిత సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని తెలిపారు. కేవలం సబ్జెక్ట్ జ్ఞానం కాకుండా, దాన్ని ప్రాయోగికంగా ఎలా వినియోగిస్తామనే దానిపై దృష్టి పెట్టాలని అన్నారు. ప్రతి విద్యార్థి బాధ్యత గల పౌరుడిగా, ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలను సృష్టించే వ్యక్తిగా ఎదగాలని పిలుపునిచ్చారు. ఉపకులపతి ప్రొ.సిఎస్ఆర్ కె. ప్రసాద్ మాట్లాడుతూ కృత్రిమ మేధస్సు మన దైనందిన జీవితంలో భాగమైందని పేర్కొన్నారు. క్వాంటం టెక్నాలజీస్, అడిటివ్ మాన్యుఫాక్చరింగ్ వంటి అభివృద్ధి చెందుతున్న రంగాలపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవడం అత్యంత ముఖ్యమని చెప్పారు. బహుశాఖ సాంకేతిక పరిజ్ఞానం ప్రాముఖ్యతను వివరించి, విద్యార్థులు సిలబస్ కే పరిమితం కాకుండా, విశ్లేషణాత్మక ఆలోచన, సృజనాత్మకత మరియు ఆవిష్కరణ దిశగా తమ మెదడును శిక్షణ పొందించాలని సూచించారు. ప్రిన్సిపాల్ ప్రొ. కె. పద్మరాజు కళాశాల వార్షిక నివేదికను, కోర్సుల వివరాలు, విద్యార్థులకు అందించే స్కాలర్షిప్స్ తదితర వివరాలను తెలియజేశారు. తదుపరి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు అతిథులు సర్టిఫికెట్లను అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, విభాగాధిపతులు, మాజీ ఉపకులపతులు, సీనియర్ ప్రొఫెసర్లు, బోధన మరియు బోధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవి దాహం తీర్చేందుకు కొలుసు పెద్ద రెడ్డయ్య
# చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చలి వేంద్రాలు ఏర్పాటు



**నూజివీడు/ఏలూరు,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** వేసవిలో పేదల దాహం తీర్చేందుకు కొలుసు పెద్ద రెడ్డయ్య ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసారథి నూజివీడు పట్టణంలో పలు సెంటర్లలో చలి వేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజలకు నేటి నుండి వేసవికాలం మూడు మాసాలు అందుబాటులో ఉండి వాసవి దాహం తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మంత్రివర్యులు పత్రికా ప్రకటన ద్వారా తెలియపరిచారు. ప్రజలకు ఎల్లవేళలా 24 గంటలు అందుబాటులో ఉంటూ పేద ప్రజల కష్టాలు ఎక్కడున్నాయి అంటే అక్కడ నేను ఉంటాను అంటూ, సమస్యలు ఎక్కడ ఉంటే అక్కడ నేనున్నానంటూ, ఆపదలో ఉన్న వారికి ఆపద్బాంధవుడులా, కష్టాల్లో ఉన్న వాళ్ళకి ఒక తోబుట్టువులా,పేద విద్యార్థులకు ఉన్నత చదువులకు చేయూతనివ్వాలన్నా, పదో తరగతి విద్యార్థులకు మూడు నెలల పాటు నారా లోకేష్ విద్యామృతం పేరున ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అందరికీ పౌష్టికాహారం మరియు స్నాక్స్ అందించి ఆయన యొక్క గొప్ప మనసును చాటుకున్న రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి. మరో అడుగు ముందుకేసి నగరంలో పలు సెంటర్లలో ప్రయాణికుల వేసవి దాహాన్ని తీర్చేందుకు ఐదు చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజలకు ఆయన శైలిలో గొప్ప సేవలు చేస్తున్నారు. ఈ చలివేంద్రాలను మంత్రివర్యుల ఆదేశాల మేరకు పట్టణ కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఐదు చలివేంద్రాలను ప్రారంభించారు. అనంతరం కూటమి నాయకులు మాట్లాడుతూ గొప్ప మనసున్న మహారాజు మా నియోజకవర్గ శాసనసభ్యులు మరియు రాష్ట్ర మంత్రివర్యులు వర్యులు కొలుసు పార్థసారథి సొంత నగదుతో ఆయన తండ్రి గారైన మాజీ పార్లమెంట్ సభ్యులు కొలుసు పెద్ద రెడ్డియ్య చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఇలా ప్రజా సేవలు చేయడం మాకు ఎంతో సంతోషకరమని అన్నారు. ఇలాంటి సేవలు చేయడం వలన మాలాంటి వారికి స్ఫూర్తినిచ్చి మేము కూడా మరిన్ని సేవలు చేయడానికి ఎంతో తోడ్పడుతుందని అన్నారు. నూజివీడు పట్టణం నాలుగు మండలాల ప్రజలు నలుమూలల నుండి ప్రభుత్వ సేవలకు, మరియు ఆసుపత్రులు,విద్యార్థుల చదువులకు, షాపింగ్ కి వ్యాపారాలకు, వచ్చిన అనేక మందికి వేసవి దాహం తీర్చడానికి, ఈ చలి వేంద్రాలు మా నాయకుడు ఏర్పాటు చేశారని, దానిని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు మేము ఆయన వెను వెంటనే ఉండి మా వంతు సహాయ సహకారాలు అందిస్తామని ఇలాంటి సేవా కార్యక్రమంలో మేము కూడా పాలుపంచుకుని మా వంతు సహాయ సహకార సహకారాలు అందిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# టి జె పి యస్ లో ఇంటర్న్‌షిప్ మరియు ప్లేస్మెంట్ డ్రైవ్



**గుంటూరు,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** స్థానిక తెల్లాకుల జలయ్య పోలిశెట్టి సోమసుందరం కళాశాల (స్వయం ప్రతిపత్తి ) లో ఈరోజు గోదావరి కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వారి సహకారంతో కళాశాల ప్లేస్మెంట్ డ్రైవ్ వారి ఆధ్వర్యంలో ఫైనల్ ఇయర్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ మరియు ప్లేస్ మెంట్ డ్రైవ్ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి వి హెచ్ కామేశ్వరశాస్త్రి పేర్కొన్నారు. ఈ డ్రైవ్ లో బీకామ్, ఎంబి ఏ, బి బి ఏ, యం కాం ఫైనల్ ఇయర్ విద్యార్థులు 59 మంది హాజరయ్యారు. వీరికి మొదటగా గ్రాండ్ టెస్ట్, తరువాత గ్రూప్ టెస్ట్, చివరగా ఇంటర్వ్యూ ద్వారా 29 మంది విద్యార్థులను ఎంపికచేశారు. ఉద్యోగాలకు ఎంపికైన వారికి రెండు నెలలు 9000 రూపాయలు నగదు తో పాటు ఉద్యోగానికి సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందని, శిక్షణ తరువాత ఆకర్షనీయమైన జీతం ఇస్తారని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ఈ డ్రైవ్ లో కళాశాల ప్లేసమెంట్ డ్రైవ్ కన్వీనర్ చంద్ర శేఖర్,సభ్యులు జి సురేష్ కుమార్, బి శ్రీనివాసరావు, యం మార్కండేయులు, ఆర్ స్వామి, కే వి యస్ రామ కృష్ణ (బిజినెస్ హెడ్ ), భాను ప్రకాష్ (రిక్రుట్మెంట్ హెడ్ ), నాగ గిరీష, హెచ్ ఆర్ మేనేజర్, జాషువా రిక్రుటింగ్ మెంబెర్ మరియు విద్యార్థులు పాల్గొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు కళాశాల సెక్రటరీ మరియు కరస్పాండంట్ కె వి బ్రహ్మం అభినందనలు తెలియచేశారు.

# వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ మరో ఏడాది(2026-27)పొడిగింపు

**అమరావతి,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓం ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (EHS) మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాష్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్(జీసూ)ను ప్రవేశపెట్టడం జరిగింది. దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు (Therapies) ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వంకూ పొడిగించడం జరిగింది. మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# సాహితీ వేత్త,సీనియర్ పాత్రికేయులు బండారు రాధాకృష్ణ విరచిత

- "సత్యాన్వేషణ" రచించిన పుస్తకం విడుదల అభినందనీయం
- అభినందించిన ఏ.పీ.ఎం.పీ.ఏ. నాయకులు





**గుడివాడ,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** సాహితీ వేత్త, సీనియర్ పాత్రికేయులు బండారు రాధాకృష్ణ విరచిత "సత్యాన్వేషణ" (ప్రశ్నించే పాత్రికేయం) పుస్తక ఆవిష్కరించిన సందర్భాన్ని పురస్కరించుకొని రాష్ట్ర నాయకులు మత్తి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏపీ ఎంపీఏ నాయకులు వీర్ల శ్రీ రామ్ యాదవ్, జి.శ్యాంబాబు, ఉల్లి సాంబశివరావు, దుక్కిపాటి కృష్ణారావు తలశిల నాగేశ్వరరావు లగ్గిశెట్టి వెంకట ప్రసాదరావులు మర్యాదపూర్వకంగా కలిసి వారి స్వగృహంలో ఘనంగా సన్మానించారు. బండారు రాధాకృష్ణ కళాకారుడిగా ప్రజాసేవకుడిగా జర్నలిస్టుగా బహుముఖ ప్రజ్ఞాశాలిగా ఎదిగి అందరి మన్ననలు పొందిన రాధాకృష్ణ జీవన ప్రస్థానంలో కొన్ని ముఖ్య ఘట్టాలు "సత్యాన్వేషణ" పుస్తకం ప్రచురించి విడుదల చేయటం చాలా అభినందనీయమని నాయకులు తెలిపారు.

# నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధిపై చర్చికి సిద్ధమ - కూటమి నాయకులు



**కంకిపాడు, ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** పెనమలూరు నియోజకవర్గంలో గత వైసిపి ప్రభుత్వంలో,కూటమి ప్రభుతువంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమ అని విలేకరుల సమావేశంలో కూటమి నాయకులు అన్నారు. పెనమలూరు నియోజకవర్గశీ,కంకిపాడు మండలం కంకిపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కూటమి నాయకులు కృష్ణ జిల్లా అధికార ప్రతినిధులు తుమ్మలపల్లి హరికృష్ణ ,బి. కామేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, నియోజవర్గ బీసీ సెల్ నాయకులు సంఘపు రంగారావు, కృష్ణాజిల్లా బ్రాహ్మణ కార్పొరేషన్ ప్రతినిధులు బాజీ, నియోజకవర్గ బిసి,ఎస్సీ సెల్ నాయకులు విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గం లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేసిన అభివృద్ధి పై చర్చించడానికి కూటమి నాయకుల సిద్ధంగా ఉన్నారు వైసీపీ నుంచి చర్చించడానికి సిద్ధమని ప్రశ్నించారు. దేవ భక్తుని చక్రవర్తి, కుటుంబ సభ్యులు కానూరు సర్పంచ్ గా పదవి చేసి ఏమి అభివృద్ధి చేశారు, అభివృద్ధి చేసే వారి పైన బురదలడం తప్ప అభివృద్ధి చేయటం చేతకాదని ఎద్దేవా చేశారు. ప్రజలకు మౌలిక సదుపాయాల రూపంలో అత్యవసర సమయాల్లో అనుమతులు రాకపోయినా త్రాగునీరు, రోడ్లు, డ్రైనేజీలు నిర్మాణాలకు నిధులు కొరత ఏర్పడినప్పుడు కాంట్రాక్టర్లను రిక్వెస్ట్ చేసి ప్రజలకు ఉపయోగపడేలా నూతన నిర్మాణాలు చేపడతా ఉంటే, అవినీతి, ఆక్రమం జరిగిందంటూ మాట్లాడటం మీ అవివేకానికి నిదర్శనం అన్నారు. పెనమలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ చేస్తున్న అభివృద్ధి చూసి ఓర్వలేక తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండి పడ్డారు మున్సిపల్ శాఖ మంత్రి తో మాట్లాడి తాడిగడప మున్సిపాలిటీకి నిధులు తీసుకురావడం తప్పా...అది మంత్రి కాళ్ల మీద పడి ప్రాధేయ పడ్డారంటూ వైసీపీ నాయకులు ప్రచారం చేయడం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పెనమలూరు నియోజకవర్గ వ్యాప్తంగా 200 కోట్ల రూపాయల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించి తాడిగడప మున్సిపాలిటీలో సైతం ప్రజలందరికీ మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేస్తా ఉంటే, వైసీపీ ఇంచార్జ్ చక్రవర్తి మింగుడు పడటం లేదు. తాడిగడప మున్సిపాలిటీలో రెండు రోజుల క్రితం 105 కోట్లతో అభివృద్ధి పనులు శంకుస్థాపన చేస్తే 105 కోట్లు అనే మాటను తట్టుకోలేని చక్రవర్తి మతి భ్రమించి మాట్లాడుతున్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో పెనమలూరు నియోజకవర్గం గన్నవరం నియోజకవర్గం తూర్పు నియోజకవర్గం మూడు నియోజకవర్గాలకు సంబంధించి మాస్టర్ ప్లాన్ రోడ్లను అభివృద్ధి సహకారం దిశగా శంకుస్థాపన చేస్తే ప్రజలందరూ వేలాదిగా శంకుస్థాపన కార్యక్రమానికి హాజరై ఎమ్మెల్యే బోడె ప్రసాద్ నాయకత్వాన్ని బలపరచడాన్ని చూసి ఈ వైసీపీ నాయకత్వానికి కళ్ళు నీరు కారుకుంటూ గుండె చెరువైపోయి దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్నారని ఎద్దేవా చేశారు. బోడె ప్రసాద్ నాయకత్వాన్ని కూటమి పార్టీలే కాక ప్రజలందరూ కూడా ఏకపక్షంగా ఆహ్వానిస్తున్నారు. అటువంటి నాయకుడిని అనాలోచితంగా తప్పుడు ఆరోపణలు చేస్తూ ఏక వచనంతో మాట్లాడటం తీవ్రంగా ఖండిస్తున్నాం, నోరు అదుపులో పెట్టుకోమని హెచ్చరిస్తున్నామన్నారు. కూటమి నాయకత్వం, కూటమి ప్రభుత్వం క్రమశిక్షణతో ముందుకెళ్తుంది, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గం ఎమ్మెల్యే బోడె ప్రసాద్, క్రమశిక్షణ అనే పేరుతో మమ్మల్ని ఆపకపోతే మీ కంటే ఎక్కువ దౌర్జన్యం, ఎక్కువ మాట్లాడగలమని హెచ్చరించారు. ప్రతిపక్ష నాయకుడిగా పేరు తెచ్చుకోవాలంటే, బూతులు తిట్టడం కాదు, ప్రజల్లోకి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకొని మాట్లాడటం నేర్చుకో అని హితవు పలికారు.

# అర్ధమూరులో ఎంపీడీవో శివప్రసాద్ పనుల పరిశీలన....



**కృత్తివెన్ను,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** బంటుమిల్లి మండలం అర్త మూరు పంచాయతీలో విబిజీ రామ్ జి పథకంలో జరుగుతున్న పనులను బంటుమిల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఆర్ఎంపీ రోడ్డు నుండి పి మస్తాన్ పోలం వరకు 125 మందితో చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు వారి హాజరును పరిశీలించారు అనంతరం ఆర్ వో ప్లాంట్ నందు మంచినీటి ప్యూరిఫై విధానాన్ని తీసుకొని జాగ్రత్తలను పరిశీలించి సూచనలు ఇచ్చారు మంచినీటిని టెస్టింగ్ నిమిత్తం శాంపుల్ బాటిల్ సేకరించారు. అలాగే ఎస్ డబ్ల్యూ పి పి షెడ్లను పర్యవేక్షించారు

# పెడనలో ప్రజా దర్బార్ నిర్వహించిన ఎమ్మెల్యే కాగిత



**పెడన,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గ పరిధిలో తోటమూల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో శాసనసభ్యులు కాగిత కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగు నీటి సమస్య, విద్యుత్ సరఫరా గురించి భూమి సమస్యల గురించి తదితర అంశాలపై ప్రజలు నుండి వినతులును స్వీకరించము. ప్రజలు ఇస్తున్న వినతులపై అధికారులు నిర్లక్ష్యం చేయకుండా, ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించేలా జవాబుదారీతనం ఉండటం ముఖ్యమని ఈ సందర్భంగా సూచించడం జరిగింది. ముఖ్యంగా ప్రజలు ఇచ్చిన అర్జీలపై తీసుకున్న చర్యలు గురించి సమాచారం చేరవేయాలని అధికారులను ఆదేశించాము వేసవి దృష్ట్యా తాగు నీటి సమస్యలపై తక్షణమే స్పందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సలపాటి ప్రసాద్ గోపి నాగబాబు శీరం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు

# పల్లెపాలెం లో స్వచ్ఛ రథం




**కృత్తివెన్ను,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పల్లెపాలెం నందు శుక్రవారం స్వచ్ఛ రథం వచ్చిన సందర్భంగా పాఠశాల విద్యార్థులు తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ సామాగ్రి పాత కాగితాలు బాటిల్స్ ఎలక్ట్రానిక్ వ్యర్థాలు ఇచ్చి స్వచ్ఛ రథం నుండి పెన్నులు పెన్సిల్లు బిస్కెట్ ప్యాకెట్స్ సబ్బులు మొదలగు వస్తువులు తీసుకోవడం జరిగింది .ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టి వి వి ప్రసాద్ మాట్లాడుతూ వ్యర్థాలను తీసుకుని పిల్లలకు విలువైన వస్తువులు ఇవ్వడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్యప్రకాష్ మాట్లాడుతూ మండలానికి ఒక స్వచ్ఛరథం ప్రభుత్వం ఏర్పాటు చేయడం హర్షనీయమని ప్లాస్టిక్ రహిత సమాజాన్ని ఏర్పాటు చేసేటందుకు ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల గ్రామాలు, పాఠశాలు స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పరిశుభ్రంగా ఉంటాయని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది మరియు గ్రామ సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు.

# ఘనంగా కుందేటి చంద్రశేఖర్ జన్మ దిన వేడుక



**గన్నవరం,ఏప్రిల్ 10 (వార్తాప్రభ) :** గన్నవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కార్యాలయం లో ఉంగుటూరు మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కుందేటి చంద్రశేఖర్ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి ఈ కార్యక్రమానికి జిల్లా నాయకులు నాలుగు మండల నాయకులు గ్రామ పార్టీ అధ్యక్షులు పాల్గొని కేక్ కట్ చేయించి శుభాకాంక్షలు తెలియచేసారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188